Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 179 మేడ్చల్ మల్కాజ్‌గిరి 20 జూలై 2023 గురువారం పేజీలు : 4

## రాహుల్ పిటిషన్‌పై రేపు సుప్రీంకోర్టు విచారణ

న్యూఢిల్లీ : పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన అప్పీలుపై ఈ నెల 21న సుప్రీంకోర్టు విచారణ జరపనుంది. రాహుల్ తరఫున సీనియర్ లాయర్ సింఘ్వి 731 పేజీల అప్పీలును సుప్రీంకోర్టులో సమర్పించారు. రాహుల్ ముగ్గురు మోదీల పేర్లను ప్రస్తావించగా, వారు కాకుండా బీజేపీ నాయకుడైన పూర్ణేష్ మోదీ పిటిషన్ వేయడం ఏమిటని ప్రశ్నించారు. మోదీ అన్న పేరు కేవలం ఒక్క సామాజిక వర్గంలోనే లేదని, వివిధ కులాల కింద 13 కోట్ల మంది వరకు ఉన్నారని ప్రస్తావించారు. కానీ, బీజేపీ నాయకులు మాత్రమే కేసులు పెట్టారని, అందువల్ల మొత్తం మోదీ సమాజానికి పరువు నష్టం కలిగినట్టు ఎలా భావిస్తారని పేర్కొన్నారు.

# మౌనం దాల్చిన...

# ముగ్గురు మొనగాళ్ళు



## ఎవరికి మద్దతిస్తారో...!?

హైదరాబాద్ / అమరావతి : ఒకనాడు జాతీయ రాజకీయాల ను విపరీతంగా ప్రభావితం చేసిన చరిత్ర తెలుగు రాష్ట్రాల కు చెందిన నాయకుల కు ఉంది. జాతీయ స్థాయిలో జనతా ప్రయోగం తరువాత ఏర్పడిన మూడు కూటముల కు తెలుగుదేశం పార్టీయే మూల సూత్రధారి అన్నది గుర్తు పెట్టుకోవాలి. దేశ రాజకీయ చరిత్రలోకి ఒక్కసరి వెళ్తే 1977లో జనతా పార్టీ ప్రయోగాన్ని మహా నాయకుడు జయప్రకాష్ నారాయణ్ చేశారు. ఆ తరువాత పదేళ్ళకు నేషనల్ ఫ్రంట్ ఆవిర్భావం వెనక తెలుగు వెలుగు అయిన ఎన్టీయార్ ఉన్నారు. ఆయన కృషి తోనే కుడి ఎడమలుగా ఉన్న పార్టీలు అన్నీ ఒక్క గూటికి చేరి కాంగ్రెస్ ని ఓడించాయి. ఇక 1996లో యునైటెడ్ ఫ్రంట్ కి ఊపిరి పోసింది టీడీపీ అధినాయకుడు చంద్రబాబు అయి చెప్పాలి. అలా ఆయన ఇద్దరు ప్రధానుల ను కూడా చేశారు. ఇక 1999 నాటికి ఏర్పడిన ఎన్డీయే లో కూడా చంద్రబాబు అత్యంత కీలకమైన భూమిక పోషించారు. ఇలా టీడీపీ అనేక కూటముల ఏర్పాటులో తనవంతు పాత్రను పోషించిన నేపథ్యం ఉంది. ఆయా సమయాల్లో టీడీపీ లోనే ప్రస్తుత బీయారెస్ అధినేత కేసీయార్ ఉ న్నారు. ఇపుడు ఆయనే ఒక శక్తిగా మారి బీయారెస్ అనే జాతీయ పార్టీ గా దాన్ని పెంచి తాను కీలక పాత్ర పోషించాలని చూస్తున్నారు. మరో వైపు చూస్తే యూపీయే ఒకటి రెండు ప్రభుత్వాలు ఏర్పడడానికి ఉమ్మడి ఏపీ నుంచి అత్యధిక ఎంపీ సీట్లను కాంగ్రెస్ ద్వారా అందించారు దివంగత సీఎం వైఎస్సార్.

ఆయన అలా జాతీయ రాజకీయాల్లో తన వంతు పాత్రను పోషించారు. ఇపుడు ఆయన కుమారుడు జగన్ ఏపీ నుంచి సీఎం గా ఉన్నారు. ఈ నేపథ్యం నుంచి చూసినపుడు కేసీయార్ అయినా చంద్రబాబు అయినా జగన్ అయినా అందరూ జాతీయ రాజకీయాల దృష్టిని ఆకర్షించిన వారే. ప్రతీ ఒక్కరూ తమదైన రాజకీయ రికార్డుల ను కలిగి ఉన్నారు. అలాంటి ఈ ముగ్గురు రాజకీయ ఉద్ధండులూ దేశం లో ప్రస్తుతం జరుగుతున్న రెండు కూటముల మధ్య రాజకీయ పోరు లో తాము ఎటు వైపో తేల్చుకోలేని పని లో పడ్డారా అన్న చర్చ అయితే సాగుతోంది. బీజేపీ వైపు ఉన్నారన్న కారణమో అనుమానమో తెలియదు కానీ చంద్రబాబు ని జగన్ని విపక్ష కూటమి పిలవలేదు. మరో వైపు చూస్తే కేసీయార్ ని కూడా విపక్ష కూటమి పట్టించుకోలేదు. ఇక ఎన్డీయే కూటమి లో జగన్ భాగస్వామి కాదు కాబట్టి ఆహ్వానించలేదు. చంద్రబాబు తానే 2018లో తెంచుకుని వెళ్లారు కాబట్టి పిలవడం అవసరం లేదు అని బీజేపీ అనుకుంటోంది.

ఇంకో వైపు చూస్తే కేసీయార్ విషయం లో కూడా బీజేపీ దూరం అంటోంది. ఇలా ఈ ముగ్గురు నేతలూ జాతీయ స్థాయిలో రెండు కీలక జాతీయ పార్టీలూ వాటికి అనుబంధంగా ఉన్న పార్టీల తో భారీ యుద్ధ సన్నాహాలకు రంగం సిద్ధం చేస్తూంటే అసలు తెలుగు గొంతు ఎక్కడా వినిపించని పరిస్థితి. ఇది నిజంగా చిత్రమైన పరిస్థితి అని చెప్పుకోవాలి. ఇలా ఎందుకు జరుగుతోంది. ఇది ఏపీ లోని రాజకీయ పార్టీల వ్యూహమా లేక వారి చేతిలో ఉన్న ఆప్షన్లుగా చూడాలా అన్నది కూడా తెలియడంలేదు. గతం తో పోలిస్తే దేశంలో రాజకీయం మారుతోంది. విపక్షలు ఐక్యతను ప్రదర్శిస్తున్నాయి. దేశంలో పదకొండు రాష్ట్రాల లో అవి అధికారం లో ఉన్నాయి. దాంతో వారి బలం బాగానే పుంజుకుంటోంది. ఇంకో వైపు చూస్తే కర్నాటక ఎన్నికల తరువాత కాంగ్రెస్ వైపు కొంత మొగ్గు కనిపిస్తోంది. అదే టైం లో బీజేపీ తగ్గింది. ఇక తెలంగాణా ను కూడా అందుకుంటే కాంగ్రెస్ పరుగు ఇంకా పెరుగుతుంది. బీజేపీ ముచ్చటగా మూడవసారి అధికారం లోకి వస్తుందా అన్నది కూడా కొంత డౌట్ లో పడిన నేపథ్యంలో తెలుగు పార్టీలు ఇపుడు చౌరాస్తాలో ఉండిపోయాయని అంటున్నారు. ఎటూ తేల్చుకోలేక అటూ ఇటూ అడుగులు వేయలేక సతమతం అవుతున్నాయని అంటున్నారు. అయితే ఇది కూడా ఒకందుకు మంచిదే అని అంటున్నారు. సరైన ఆప్షన్ ని సరైన టైం లో ఎంచుకునేందుకు వీలు ఉంటుందని అంటున్నారు. చూడాలి మరి తెలుగు రాజకీయ జాతీయ తెరపైన వెలిగేది ఎపుడో.

## మధ్యాహ్న భోజనంలో చేపలు! - మత్స్యశాఖ కసరత్తు

హైదరాబాద్ : విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో చేపల కూరను చేర్చాలని మత్స్యశాఖ యోచిస్తున్నది. ఇందుకు సంబంధించి మత్స్య ఫెడరేషన్ కసరత్తు చేస్తున్నది. మొత్తం విద్యార్థులు ఎంత మంది ఉంటారు, వారికి ఎన్ని రోజులు చేపల కూర వడ్డించాలి, ఒక్కొక్కరికి



ఎన్ని గ్రాములు అవసరం, పిల్లలందరికీ కలిపి ఎంత మొత్తంలో చేపలు అవసరం అవుతాయి, ఇందుకు నిధుల సమీకరణ ఎలా అనే అంశంపై అధికారులు లెక్కలు తీస్తున్నారు. ఈ కసరత్తు పూర్తి కాగానే పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు.

## మోడీ... ప్రియాంక గాంధీ అక్కడ నుంచే పోటీ...?

హైదరాబాద్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఎక్కడ నుంచి పోటీ చేస్తారు అన్నది ఇపుడు చర్చగా ముందుకు వస్తోంది. నరేంద్ర మోడీ 2019లో వారణాసి నుంచి పోటీ చేసి గెలిచారు. ఈసారి కూడా ఆయన అక్కడ నుంచే పోటీ చేస్తారు అని అంటున్నారు. దానితో పాటు రెండవ సీటుగా ఆయన సౌత్ నుంచి పోటీకి దిగుతారు అని అంటున్నారు. ఆ రెండవ సీటు ఎక్కడ ఉంది అన్నదే ఇపుడు బీజేపీలోనూ బయటా అతి పెద్ద చర్చకు దారి తీస్తోంది. మూడు రాష్ట్రాలలో మూడు చోట్ల కీలక సీట్లను మోడీ కోసం ఎంపిక చేసి ఉంచారని అంటున్నారు. తమిళనాడు నుంచి మోడీ పోటీ చేస్తారు అని నిన్నటిదాకా ప్రచారంలో ఉన్న మాట. అది కన్యాకుమారి సీటు అని అన్నారు. అలాగే ఇపుడు రామేశ్వరం అని కూడా అంటున్నారు. ఇక కర్నాటకలో బీజేపీకి బలం ఉంది. దాంతో ఆ రాష్ట్ర రాజధాని బెంగుళూరు లోక్ సభ నుంచి ప్రధాని పోటీకి దిగుతారు అన్నది మరో ప్రచారంగా ఉంది. ఇపుడు వీటికి మించి ఆసక్తిని పెంచే మరో చర్చ కూడా సాగుతోంది. నరేంద్ర మోడీ తెలంగాణా మీద ఫోకస్ పెట్టారని వచ్చే ఎన్నికల్లో కనీసం గతంలో గెలిచిన నాలుగు సీట్లకు రెట్టింపు సీట్లు దక్కించుకోవాలన్న ఉద్దేశ్యంతో ఆయన స్వయంగా తానే పోటీ చేస్తారు అని అంటున్నారు.



ప్రస్తుతం బీజేపీ చేతిలో ఉన్న సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి ప్రధాని నరేంద్ర మోడీ పోటీ చేయవచ్చు అని ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది. సికింద్రాబాద్ సీటు బీజేపీకి బలమైనది. అనేక సార్లు సీనియర్ నేత బండారు దత్తాత్రేయ అక్కడ నుంచి గెలిచారు. ప్రస్తుతం కిషన్ రెడ్డి ఎంపీగా ఉన్నారు. సురక్షితమైన ఈ సీటు నుంచి మోడీ పోటీ చేస్తే దీని ప్రభావం కాస్తా తెలంగాణాలోని ఇతర జిల్లాల మీద ఉంటుందని బీజేపీ ఈసారి ఎనిమిది నుంచి పది ఎంపీ సీట్లు అయినా గెలుచుకునేందుకు ఇది ఉపకరిస్తుందని బీజేపీ వ్యూహకర్తలు భావిస్తున్నారుట. మరో వైపు చూస్తే ప్రియాంకా గాంధీని కూడా తెలంగాణా నుంచి పోటీ చేయించాలని కాంగ్రెస్ పెద్దలు ఆలోచన చేస్తున్నారు. ఆమెను మెదక్ నుంచి కానీ లేకపోతే కాంగ్రెస్ కి కంచుకోటలైన ఇతర ఎంపీ సీట్ల నుంచి కానీ పోటీ చేయించాలని ప్రతిపాదిస్తున్నారుట. మెదక్ నుంచి అప్పట్లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ గెలిచారు ఆమె 1980లో ఇక్కడ నుంచి ఘన విజయం సాధించి ప్రధాని అయ్యారు. అయితే కాంగ్రెస్ ప్రభ అంతా 1998లో ముగిసింది. 2004 నుంచి చూసుకుంటే వరసగా నాలుగు సార్లు బీయారెస్ ఇక్కడ నుంచి గెలుస్తూ వస్తోంది.

అయితే కాంగ్రెస్ బలం బాగా పెరిగింది అని నమ్మకంతో ఉన్న ఆ పార్టీ నేతలు ఇందిరమ్మ పోలికలు నిండా ఉన్న మనవరాలిని మెదక్ నుంచి పోటీకి పెడితే తెలంగాణాలో మెజారిటీ సీట్లను గెలుచుకోవచ్చు అని ప్లాన్ చేస్తున్నరని అంటున్నారు. ప్రియాంకా గాంధీ కూడా తెలంగాణా మీద దృష్టి పెట్టారు. ఆమె కాంగ్రెస్ ని అధికారంలోకి తేవాలని కూడా చూస్తున్నారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో కనుక ఘన విజయం సాధిస్తే ప్రియాంక మెదక్ నుంచి పోటీ చేయడం ఖాయమని అంటున్నారు. మొత్తానికి అటు ప్రధాని మోడీ ఇటు ప్రియాంకా గాంధీ తెలంగాణా నుంచే రెడీ అంటున్నారు అని రాజకీయ వర్గాలలో చర్చ అయితే జోరుగా సాగుతోంది.

# 'ఉమ్మడి పౌరస్మృతి బిల్లు'పై

# యుద్ధమేనా!?



## నేటి నుండి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు

ఒకవైపు పట్టుదల.. మరోవైపు పంతంతో.. ఈ రెండు కూడా ప్రజాస్వామ్యానికి మంచిదికాదు. సామరస్యం.. చర్యలు.. శాంతి యుత వాతావరణం తోనే ఏదైనా సాధ్యమవుతుందని పార్లమెంటు వ్యవహారాలపైనా.. ప్రజా స్వామ్య దేశాల్లో జరుగుతున్న జరిగిన పరిణామాలపైనా అవగాహన ఉన్నవారు చెబుతారు. కానీ దేశం లో మాత్రం అన్ని పార్టీలకూ.. ఇప్పుడు మొదటి రెండే ప్రాణ ప్రదం అయిపోయాయి. పట్టుదలతో అధికార పార్టీలు పంతంతో ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్న తీరుతో ప్రజస్వామ్య దేవాలయాలుగా భావించే చట్టసభలు ఒట్టిపోతున్నాయి. ప్రస్తుతం ఈ చర్చంతా.. గురువారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాలపైనే జరుగుతుండడం గమనార్హం. అధికార బీజేపీ.. పట్టుదలతో ఉండగా.. కాంగ్రెస్ కూడా అంతే పంతంతో ఉంది. మోడీ నేతృత్వం లోని అధికార పక్షాన్ని తీసుకుంటే.. ఈ పార్లమెంటు సభల్లో ఎట్టి పరిస్థితి లోనూ కీలకమైన ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు పచ్చజెండా ఊపించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏం జరిగినా ఫర్వాలేదు.. మేనిఫెస్టోలో పేర్కొన్న ఈ విషయానికి మాత్రం ఓకే అనిపించుకోవాల ని పట్టుదలతో వ్యవహరిస్తోంది. ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే.. రెండు కీలక విషయాల పై పంతంతో ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకటి కీలకమైన రాహుల్ గాంధీ పార్లమెంటరీ సభ్యత్వం పై వేటు విషయాన్ని పార్లమెంటు లో ప్రస్తా వించడం తద్వారా మోడీ సర్కారు ను ఇరుకున పెట్టాలనేది ప్రధాన వ్యూహంగా ఉంది. అదేసమయం లో ధరల పెరుగుదల ను కూడా కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగానే తీసుకుంది. ఎట్టి పరిస్థితి లోనూ టమాటాలు ఇతర నిత్యావసర వస్తువులు.. అదేవిధంగా గ్యాస్ ధరల ను కూడా పార్లమెంటు వేదిగా చర్చించి.. మోడీ ని ఇరుకున పెట్టే వ్యూహంతో ఉంది. ఇక మిగిలిన అంశాల్లో ఉమ్మడి పౌరస్మృతి అంశం కూడా ఉ ంది. మొత్తంగా చూస్తే.. ఒకవైపు పట్టుదల మరోవైపు పంతం.. ఈ సారి పార్లమెంటు సమావేశాల ను డామినేట్ చేయడం ఖాయమ ని అంటున్నారు పరిశీలకులు.

## సంపాదకీయం

# ఈ విషయాన్ని ఎలా మరుస్తారు మోడీ?

ఎప్పుడేం మాట్లాడాలో అది మాట్లాడితేనే బాగుంటుంది. అందుకు భిన్నంగా ఎజెండా పెట్టుకొని ప్రసంగాలు చేయటం.. అది కూడా రాజ్యసభలో.. ప్రధానమంత్రి హోదాలో ఉన్న ప్రముఖుడు అంటే ఇంకేం చెప్పాలి. తాజాగా కాంగ్రెస్ పార్టీని దారుణమైన విలన్ గా అభివర్ణిస్తూ ప్రధాని మోడీ చేసిన ప్రసంగం ఇప్పుడు పెనుసంచలనంగా మారింది. కాంగ్రెస్ పార్టీ ఎంత దారుణమైనది? మరెంత దుర్మార్గమైనది? ఆ పార్టీ కారణంగానే దేశంలో ప్రజాస్వామ్యం గొంతు నులిమిందన్న తీవ్ర వ్యాఖ్యలు ఇప్పుడే ఎందుకు? అన్నది ప్రశ్న. దీనికి సమాధానం సింపుల్ గా చెప్పేయొచ్చు. దేశంలో జరుగుతున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కారణంగా మోడీనోటి నుంచి వచ్చే మాటలు మారిపోవటమే కాదు.. కాంగ్రెస్ దేశానికి ఎంత నష్టం చేసిందన్న విషయాన్ని ఆయన అందరికి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. దేశానికి కాంగ్రెస్ నష్టమే చేసిందనే అనుకుందాం మోడీ చెప్పినట్లు. కానీ.. అందుకు తమ పార్టీ కూడా సాయం చేసిందన్న వైనాన్ని అస్సలు మర్చిపోకూడదు. ఆ మాటకు వస్తే.. కాంగ్రెస్ తప్పులే చేయకుంటే ఈ రోజున దేశానికి మోడీ అవసరం ఎందుకు వచ్చేది? ఆయన ఎందుకు ప్రధానమంత్రి అయ్యారు. కాంగ్రెస్ తప్పు చేసిందని దేశ ప్రజలు డిసైడ్ చేసి.. ఆ పార్టీని కాదని మోడీ సర్కారు చేతికి అధికారం ఇచ్చిన తర్వాత.. ఇప్పుడు పోస్టు మార్టం దేనికి? దేశంలో జరిగిన దారుణాలకు కాంగ్రెస్ పార్టీని బాధ్యుల్ని చేసే కన్నా.. అలాంటి పరిస్థితి అసలెందుకు వచ్చిందన్న విషయాన్ని వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా మాట్లాడే మోడీ విశ్లేషిస్తే బాగుండేది. కాంగ్రెస్ పార్టీకి చెందిన గులాంనబీ అజాద్ కు మొన్నటికి మొన్న పద్మభూషణ్ పురస్కారాన్ని ఇచ్చిన మోడీ ప్రభుత్వం చెప్పిందేమిటి? కాంగ్రెస్ పార్టీ చెడ్డది కాదు.. దాన్ని నడిపించిన కొందరు వ్యక్తులు మాత్రమే అనేగా? అలాంటప్పుడు పార్టీ మీద ఇంతటి ఘాటు వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం ఉందా? ఆ మాటకు వస్తే.. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నేతలు చేసిన తప్పులే.. వారికి ప్రత్యామ్నాయం కోసం దేశం వెతికే ప్రయత్నం చేయటం.. మోడీ చేతికి పగ్గాలు ఇవ్వటం చేసిందన్న విషయాన్ని మర్చిపోకూడదు. మిగిలిన సంగతులు ఎలా ఉన్నా.. తాను రెండు దఫాలు ప్రధానమంత్రిని అయ్యానంటే అందుకు కారణమైన కాంగ్రెస్ కు మోడీ మాష్టారు ధన్యవాదాలు చెప్పాలి కదా? ఆ చిన్న లాజిక్ ను మర్చిపోయి.. కాంగ్రెస్ మీద అంతలా విరుచుకుపడటం ఏమాత్రం న్యాయం? కాంగ్రెస్ పార్టీ లేకున్నా.. ఆ పార్టీకి చెందిననేతలు పలువురు తప్పులు చేయకుంటే.. ఇవాళ మోడీ ఇలా మాట్లాడే అవకాశం ఉండేది కాదు కదా? అయినా.. ఇప్పటికిప్పుడు కాంగ్రెస్ గుణగణాలు.. మంచి చెడ్డలు అధికారం చేతికి వచ్చిన ఎనిమిదేళ్లకు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఏముంది? చరిత్రను చెప్పటానికి.. చరిత్రలో జరిగిన తప్పుల్ని సరి చేసే అవకాశం.. అధికారం మోడీ చేతిలో ఉన్నప్పుడు.. దాన్ని మార్చకుండా మాటలకే పరిమితం కావటం ఏమిటి మోడీజీ?

# జాబితా ప్రదర్శించకుండానే పరిహారం పంపిణీ!



బెజ్జంకి : పారిశ్రామిక అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా బెజ్జంకి మండలం దాచారం శివారులోని సర్వే నంబర్ 124లోని ప్రభుత్వ భూమిని రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు కేటాయించేందుకు కొద్ది నెలల కిందట సర్వే చేపట్టారు. సర్వే నంబర్‌లో సుమారు 332 ఎకరాల భూమి ఉండగా సుమారు 113 మంది రైతులకు గతంలో అసైన్డ్ పట్టాలిచ్చారు. కొందరు సాగు చేసుకుంటుండగా మరికొందరు బీడుగా ఉంచారు. వాటిని పరిశ్రమలకు కేటాయిస్తున్న నేపథ్యంలో భూమి కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లింపుపై నాలుగేళ్లుగా తర్జనభర్జన కొనసాగుతోంది. ఇటీవలే ఎకరానికి రూ.10 లక్షల చొప్పున పరిహారాన్ని ఖరారు చేసిన అధికారులు.. అర్హులైన రైతులను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. తుది జాబితా మాత్రం అటు పంచాయతీ, ఇటు రెవెన్యూ కార్యాలయంలో ప్రదర్శించకపోవడం, జాబితాలో అనర్హులు ఎక్కువగా ఉన్నారంటూ రైతులు తహసీల్దార్‌కు, జిల్లా పాలనాధికారికి ఫిర్యాదులు సమర్పిస్తున్నారు. అధికారులు మాత్రం జాబితా పూర్తి స్థాయిలో సిద్ధం కాలేదని, అభ్యంతరాలకు ఓ జాబితా పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించినట్లు చెబుతున్నారు. ఎలాంటిదీ ప్రదర్శించలేదని, తుది జాబితా సిద్ధం కాకుండానే ఇప్పటికే 20 మంది రైతులకు చెక్కులు ఎలా పంపిణీ చేశారంటూ ఆరోపిస్తున్నారు. గత నెలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొనగా చెక్కుల పంపిణీ చేశారు. మధ్యవర్తుల ప్రమేయంతో జాబితా తయారీలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తుండగా అలాంటిదేమీ లేదని అధికారులు చెబుతున్నారు.

విస్తీర్ణాల్లో హెచ్చుతగ్గులుపరిహారం చెల్లింపునకు అధికారులు ప్రతిపాదించిన జాబితాలో అనర్హుల పేర్లు చేరాయని రైతులు ఆరోపిస్తున్నారు. విస్తీర్ణానికి, జాబితాలో నమోదు చేసిన భూముల విస్తీర్ణానికి తేడాలు ఉన్నాయంటున్నారు. కొందిరికి పట్టాలు ఉన్నా పేర్లు చేర్చలేదని, కొందరికి ఎక్కువ, మరికొందరికి తక్కువగా విస్తీర్ణాన్ని నమోదు చేసి, అవకతవకలకు పాల్పడ్డారని చెబుతున్నారు. గత వారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి అక్రమాలు జరిగాయని, న్యాయం చేయాలంటూ రైతులు ఫిర్యాదు సమర్పించారు. గ్రామంలో పలుకుబడి ఉన్న మధ్యవర్తుల కారణంగానే అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఉన్నతాధికారులు సవరించి న్యాయం చేయాలని కోరుతున్నారు. జాబితాను ప్రదర్శించలేదని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. దీనిపై తహసీల్దార్ విజయప్రకాశ్‌రావును వివరణ కోరగా అర్హుల జాబితా పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదని, ఇంకా అభ్యంతరాలు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సర్వే పూర్తి చేసి, గతంలోనే పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించి వినతులు స్వీకరించినట్లు పేర్కొన్నారు.

# ఏకరూపం.. లోపాలమయం!



కరీంనగర్ : జిల్లాలోని బడుల్లో ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తులు మెజారిటీ పాఠశాలల్లో విద్యార్థులను బహురూపాలుగా చూపిస్తున్నాయి. వస్త్రం పంపిణీ నుంచి వాటిని కుట్టే పని వరకు లోపాలు బయటపడుతున్నాయి. అధికారులు, ఉపాధ్యాయుల కళ్లెదుటే కనిపిస్తున్నా వీటిని కట్టడి చేయడం తమ పనికాదంటూ నిస్తేజంగా ఉంటున్నారు. కుట్టు కూలీ తక్కువ ఇస్తున్నారనే సాకుతో ఇష్టారాజ్యంగా వాటిని కుడుతున్నారు. కొలతలు తీసుకోకుండానే దుస్తులు కుట్టించడంతో లోపాలు ఉంటున్నాయి.

54 వేల మందికి పంపిణీ

జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న 54,100 మందికి రెండేసి జతల చొప్పున ఏకరూప దుస్తులు అందజేశారు. ఒక్కో డ్రెస్‌కు కుట్టు కూలీకి రూ.50 చెల్లిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల యాజమాన్య కమిటీ తీర్మానంతో వీటిని కుట్టించాలి. తక్కువ కుట్టు కూలీకి వాటిని కుట్టేందుకు స్థానికులు ఆసక్తి చూపడం లేదు. ఇతర ప్రాంతాల్లో కుట్టించి తెస్తున్నారు. కొందరైతే పక్క రాష్ట్రంలో కుట్టించారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 70 శాతం బడులను మహిళా గ్రూపులకు, మిగిలినవి ఇతరులు కుట్టు పనిని చేపట్టారు.

పట్టించుకునే వారెవరు?

ఏకరూప దుస్తుల వస్త్రం, కుట్టు నాణ్యత ఎవరికీ అంతుపట్టని అంశంగా మారింది. కుట్టుకూలీ తక్కువ మొత్తంలో ప్రభుత్వం అందించడమే దీనికి ప్రధాన కారణం. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో జిల్లాలోని బాలలకు దుస్తులు అందినా అవి నాణ్యత లేకుండా ఉంటున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు దృష్టి నిలపకపోవడంతో ఏకరూప దుస్తుల లక్ష్యం నీరుగారుతోంది.నిబంధనలు పాటించకుండా..

విద్యార్థుల శారీరక కొలతలు తీసుకోకుండానే ఏకరూప దుస్తులను సైజుల నంబర్ల ప్రకారం కుట్టి అందిస్తున్నారు. అవి వదులుగా, పొట్టిగా, బిగుతుగా ఉంటున్నాయి. వారు వాటిని ధరించేందుకు ఇష్టపడడం లేదు. వాటిని ధరిస్తే బాలలు విభిన్న రూపాల్లో కనిపిస్తున్నారు. కుట్టించడంలోని నిబంధనలను జిల్లా విద్యాశాఖ, ప్రధానోపాధ్యాయులు అమలు చేయడం లేదు. తక్కువ కూలీకి ఎవరూ వాటిని కుట్టేందుకు ముందుకు రావడంలేదు. తల్లిదండ్రులు మరికొంత మొత్తాన్ని కుట్టుకూలీ కోసం చెల్లించేలా చైతన్యపర్చడం, దాతల సహకారాన్ని తీసుకోవడం వంటివి చేయడంలేదు.టోకుగా వందలాది మందివి కుడుతున్న నిర్వాహకులు వాటి కుట్లను సరైన రీతిలో వేయడం లేదు. వాటిని ధరించిన కొద్ది రోజులకే కుట్లు ఊడిపోయి వాటిని వేసుకోలేని పరిస్థితి నెలకొంది. టోకుగా ఇష్టానురీతిలో దుస్తులను కుట్టడం నిర్వాహకులకు లాభదాయకంగా మారడంతో కొన్నేళ్లుగా వారు ఇదే వృత్తిని కొనసాగిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చాలామంది ఏకరూప దుస్తులను ధరించేందుకు ఇష్టపడటం లేదు. వారికి తోచినవి వేసుకుని పాఠశాలలకు వస్తున్నారు. చిట్లిపోవడం, బటన్లు ఊడిపోవడం వంటివి జరుగుతున్నాయి. ప్యాంట్లు, చొక్కాలు పొట్టిగా, పొడుగ్గా ఉంటున్నాయి. చిరిగిన చోట కుట్టించాలన్న, పొడవును తగ్గించాలన్న సాధారణ దర్జీల వద్దకు వెళ్తే రూ.50కు పైగానే ఖర్చవుతుందని పలువురు చెబుతున్నారు. ప్రాథమికోన్నత తరగతుల బాలికలకు వస్త్రం అందిస్తున్నారు. 4-7 తరగతుల బాలికలు మోకాళ్ల వరకు వేసుకునేందుకు ఇష్టపడటం లేదు. ఒక వేళ వేసుకున్నా ప్యాంట్ వేసుకుని ధరిస్తున్నారు.

దృష్టికి తీసుకొస్తే పరిశీలిస్తాం- జనార్దన్ రావు, డీఈవో

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ ఏకరూప దుస్తులను అందించాం. దుస్తులు చినిగినట్లు, నాణ్యత లేవని ఫిర్యాదులు రాలేదు. ఇలాంటి వాటిపై పాఠశాలలు, తల్లిదండ్రులు మా దృష్టికి తీసుకొస్తే బడులను సందర్శించి వాటిని పరిశీలించడంతోపాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నాం.

# వేతనం అందక.. పూట గడవక..

కరీంనగర్ : గ్రామీణ ప్రాంతాల్లో కూలీ పనులు దొరకకపోవడంతో చాలామంది ఉపాధిహామీ పనికి వెళ్తున్నారు. ఆపదలో ఆదుకుంటుందనుకున్న ఉపాధి హామీ పథకం.. సకాలంలో డబ్బులు అందక కూలీలు రెండు నెలలుగా పస్తులుండాల్సి వస్తోంది. కరవులో ఆసరాగా ఉంటుందని ఉపాధి పని చేస్తే వేతనాలు రాకపోవడంతో కూలీలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులు మొత్తం ఉపాధి హామీ పనులకు వెళ్లగా, డబ్బుల కోసం ఎదురుచూపులే మిగిలాయి. క్షేత్రసహాయకుల ఇళ్లతోపాటు మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు చొరవ చూపి వేతనాలు వచ్చేలా చూడాలని కూలీలు కోరుతున్నారు.

జిల్లాలో మండలాలు : 17

రావాల్సినవి : రూ.30 కోట్లు

రూ.12 వేలు రావాలి..- మిల్కురి నర్సయ్య, రెవెల్లి

రెండు రోజుల క్రితం అక్టోబరు నెల వేతనం వచ్చింది. ఇంకా రెండు నెలల(నవంబరు, డిసెంబరు)కు సంబంధించిన సుమారు రూ.12 వేల వరకు రావాల్సి ఉంది. గతంలో త్వరగా వచ్చేవి. ప్రస్తుతం రావడంలేదు. చేయడానికి పని లేక చేసిన పనికి కూలీ డబ్బులు రాకపోవడంతో పూట గడవడం కష్టంగా మారుతుంది.

త్వరగా వచ్చేలా చూడాలి- జనగాం లక్ష్మి, చాకుంట

గ్రామంలో వేరే పనులు లేకపోవడంతో ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉండడంతో పనికి వెళ్లాను. దినసరి కూలీగా చేస్తుండడంతో వచ్చిన దాంతో జీవిస్తాం. కానీ రెండు నెలలుగా కూలీ డబ్బులు రాకపోవడంతో



ఇబ్బందిపడుతున్నా. అధికారులు స్పందించి ఎప్పటి డబ్బులు అప్పుడే వచ్చేలా చూడగలరు.

ఉన్నతాధికారులకు వివరిస్తాం- రాజు, ఏపీవో, చొప్పదండి

గత రెండు నెలలుగా కూలీల వేతనాలు రావడంలేదు. ఉపాధి హామీ పథకానికి రావాల్సిన నిధులు రావడంలో జాప్యంతోనే ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్యను త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాం. కూలీల వేతనాలు వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి.

# ఎవరికీ పట్టని ఎలిగోడు

పెద్దపల్లి: ఉమ్మడి జిల్లాలో చివరగా ఏర్పడిన ఎలిగేడు మండలం ఇప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉంది. 2001లో ఎలిగేడు మండలకేంద్రంగా ఏర్పాటు కాగా, రెండు దశాబ్దాలు పూర్తయినా వివిధ పనుల కోసం ఇతర ప్రాంతాలవైపు చూడక తప్పడం లేదు. వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయకపోవడం, ఇప్పటికీ ఇన్‌ఛార్జి అధికారులే పర్యవేక్షిస్తుంటంతో మండల ప్రజలకు పరాధీనత తప్పడం లేదు. జిల్లాల పునర్విభజన అనంతరం 2017లో జిల్లాలో కొత్తగా ఏర్పాటైన రామగిరి, అంతర్గాం, పాలకుర్తి మండలాల్లో మాత్రం దాదాపు అన్ని వ్యవస్థలూ అందుబాటులోకి రావడం గమనార్హం.

జూలపల్లి నుంచే పోలీసు సేవలు ఎలిగేడు మండలకేంద్రంగా ఆవిర్భవించిన తర్వాత వివిధ ప్రభుత్వ శాఖలను ఏకకాలంలో కాకుండా వంతులవారీగా ఏర్పాటు చేస్తుండటంతో ఆయా శాఖల పర్యవేక్షణ జూలపల్లి నుంచే సాగుతోంది. ఎలిగేడులోని ఆరోగ్య ఉపకేంద్రాన్నే ప్రధాన ఆరోగ్య కేంద్రంగా భావించాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్దపల్లి జిల్లా ఆవిర్భావం తరువాత ఎలిగేడు ఆరోగ్య కేంద్రానికి ప్రత్యేక వైద్యుడిని నియమించారు. అయితే ఇప్పటికీ రికార్డుల నిర్వహణ, డ్రాయింగ్ అధికారాలు జూలపల్లి పీహెచ్‌సీ పరిధిలోనే ఉన్నాయి. శాంతిభద్రతలను పర్యవేక్షించే పోలీస్‌స్టేషన్ జూలపల్లిలోనే కొనసాగుతోంది. ఎలిగేడులో ప్రత్యేక ఠాణా ఏర్పాటు చేయాలని కోరుతూ మండల ప్రజలు ఎన్ని పర్యాయాలు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం దక్కలేదు. ఇవి కాకుండా నీటిపారుదల, మిషన్ భగీరథ తదితర శాఖల పర్యవేక్షణ సుల్తానాబాద్ నుంచే జరుగుతోంది.

ఆది నుంచి తక్కువ ప్రాధాన్యం

18 పంచాయతీలున్న జూలపల్లి మండలం నుంచి 10 పంచాయతీలను విడదీసి 2001లో ఎలిగేడు కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేశారు. దీంతో జూలపల్లి 8 గ్రామాలకే పరిమితమైంది. తాజాగా ప్రభుత్వం కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయడంతో ఎలిగేడులో 12, జూలపల్లిలో 13కు చేరింది. మండలాల పునర్విభజనతో జిల్లాలో కొత్తగా రామగిరి, అంతర్గాం, పాలకుర్తి మండలాలను ఏర్పాటు చేశారు. వీటిలో పాలకుర్తిలో మాత్రమే పోలీస్‌స్టేషన్ బసంత్‌నగర్‌లో ఉండగా మిగిలిన రెండు మండలాల్లో స్థానికంగానే అందుబాటులోకి తెచ్చారు. ఠాణాలతో పాటు అన్ని శాఖల కార్యాలయాలు మండలకేంద్రాల్లో ఏర్పాటయ్యాయి. రామగిరి మండలం ఏర్పాటైన తరువాత బేగంపేట ఉప కేంద్రాన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంగా ఉన్నతి కల్పించారు. వీటితోనైనా ఎలిగేడులో కొత్త ఠాణా ఏర్పాటు, ఆరోగ్య కేంద్రానికి ప్రతిపత్తి కల్పించడం దిశగా పాలకులు చొరవ చూపలేదు. మరోవైపు భౌగోళికంగా రాజీవ్ రహదారికి దూరంగా ఉండటంతో ఎలిగేడుకు రవాణా సౌకర్యాలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. జిల్లా కేంద్రం నుంచి కేవలం 18 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నా నేరుగా బస్సు సౌకర్యం లేదు.పలుమార్లు ప్రతిపాదనలు చేశాం-దాసరి మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే

ఎలిగేడులో అన్ని రకాల ప్రభుత్వ శాఖలతో పాటు పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కోసం గతంలోనే ప్రభుత్వానికి పలు పర్యాయాలు ప్రతిపాదనలు పంపాం. హోం మంత్రితో పాటు పోలీసు ఉన్నతాధికారులకు సైతం వినతిపత్రాలు అందజేశాం. జూలపల్లి పరిధిలో నేరాల నమోదు తక్కువగా ఉండటం, ఇతర సాంకేతిక కారణాలతో ఎలిగేడుకు ప్రత్యేక ఠాణా ఏర్పాటు ప్రక్రియకు విఘాతం కలుగుతోంది. మరోసారి ప్రయత్నాలు ముమ్మరం చేస్తాం.

ఠాణా లేక సెటిల్‌మెంట్లు ఎక్కువయ్యాయి-తాండ్ర అంజయ్య, శివపల్లి

ఎలిగేడులో పోలీస్‌స్టేషన్ లేకపోవడంతో వివిధ సమస్యలపై జూలపల్లికి వెళ్లాల్సి వస్తోంది. తరచూ వెళ్లాల్సిన వారు దూరభారంగా మారడంతో స్థానిక నాయకులను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో పంచాయతీలు, సెటిల్‌మెంట్లు ఎక్కువయ్యాయి. వీటిని నియంత్రించేందుకు స్థానికంగా ఠాణా ఏర్పాటు చేయడమే పరిష్కారం.

# తీరనున్న గిరిజనుల దశాబ్దాల స్వప్నం

పెద్దపల్లి: గిరిజనుల దశాబ్దాల కల నెరవేరనున్నది. మానాల-మర్రిమడ్ల రహదారి పనులు ప్రారంభమయ్యాయి. రుద్రంగి, కోనరావుపేట మండలాలను కలిపే ఈ రహదారిని ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా అధికారులు, పాలకులను ప్రజలు కోరుతున్నా పట్టించుకోలేదు. దీంతో కాలినడకనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఇది పూర్తయితే రవాణా కష్టాలు తీరనున్నాయి. ప్రస్తుత బాల్కొండ నియోజకవర్గ పరిధిలో ఉన్న రుద్రంగి మండలంలోని ఉమ్మడి మానాలకు చెందిన ప్రజాప్రతినిధులు రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దృష్టికి రహదారి సమస్యను తీసుకువెళ్లారు. ఆయన స్పందించి రెండేళ్ల క్రితం రూ.8.50 కోట్లను మంజూరు చేశారు. అటవీశాఖ అనుమతి రాక పనుల ప్రారంభానికి కొంత జాప్యం చోటుచేసుకుంది. తొలుత కేటాయించిన నిధుల్లో నుంచి అటవీశాఖకు రూ.2.78 కోట్లను చెల్లించాల్సి వచ్చింది. దీంతో మరో రూ.9 కోట్లు అవసరమని ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపగా కొద్ది రోజుల్లో నిధులు మంజూరు కానున్నాయని అధికారులు చెబుతున్నారు. అటవీశాఖ అనుమతి రావటంతో గత ఏడాది ఫిబ్రవరి 20న స్వయంగా మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఉమ్మడి మానాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం సందర్భంగా మానాల-మర్రిమడ్ల రోడ్డు పనులకు కూడా భూమిపూజ చేశారు. ప్రస్తుతం పనులు చేపడుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ మార్గంలోని అటవీ ప్రాంతం నుంచి ఉన్న కచ్చా రోడ్డులో వర్షాకాలం మినహా మిగతా సమయాల్లో ద్విచక్ర వాహనాల రాకపోకలు అతి కష్టం మీద కొనసాగేవి. అయితే చాలా వరకు వాగులు, కోతకు గురైన ఎత్తైన ప్రాంతాల నుంచి ప్రయాణంతో ఎన్నో ఇబ్బందులు పడేవారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి. అయితే వర్షాకాలంలో చినుకు పడితే చాలు ఈ రహదారిలో వాహనాల రాకపోకలు అటుంచితే కనీసం బాటసారులు కూడా వెళ్లలేని పరిస్థితి ఉండేది. జిల్లాలోని వివిధ గిరిజన గ్రామాలను కలిపే ఈ దారి అంతా నల్లరేగడి మట్టితో ఉండి పంట పొలాల మాదిరిగా మారిపోయేది. మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గిరిజనులకు రహదారి నిర్మాణంతో కష్టాలు తీరనున్నాయి.

పూర్తయితే ప్రయోజనం- మాలోత్ రాందాస్, బడితండా

గిరిజనులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే విద్య, వైద్య, వాణిజ్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. వచ్చే వర్షాకాలం లోపు తారు రోడ్డు వేసే పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.తిప్పలు తప్పుతాయి- గణేశ్, అడ్డాబోరుతండా

జిల్లాలోని కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని గిరిజన గ్రామాల్లోని బంధువులను కలిసేందుకు ఇన్నాళ్లు కాలినడకే శరణ్యమైంది. రోడ్డు పనులు పూర్తయితే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందే అవకాశాలు పెరుగుతాయి. మండల, జిల్లా కేంద్రాలతో పాటు చుట్టు పక్కల ఉన్న జిల్లా కేంద్రాలకు వివిధ అవసరాల నిమిత్తం వెళ్లే వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. మార్కెటింగ్ అవకాశాలు పెరిగి ప్రజలకు అన్ని రకాల వస్తువులు అందుబాటులోకి వస్తాయి.

# పల్లెల్లో జన్ ఔషధి!

మహబూబాబాద్: తక్కువ ధరలకే మందులు లభిస్తుండటంతో దేశంలో జనరిక్ మెడికల్ షాపులకు ఆదరణ పెరుగుతోంది . రాష్ట్రంలో వీటిని ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం సహకార సంఘాల ద్వారా ఔషధాల విక్రయశాలలను అందుబాటులోకి తీసుకురానుంది. ఇప్పటికే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) వివరాలను అధికారుల నుంచి తెప్పించుకుంది. ఆ దిశగా కసరత్తు చేస్తోంది. వీటి విక్రయాలు, ఫార్మసీ లైసెన్స్, ఇతర విషయాలకు సంబంధించి మార్గదర్శకాలు రాలేదు. త్వరలో సమావేశం నిర్వహించి విధివిధానాలు ఖరారు చేస్తారని సహకారశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 36 ప్రతిపాదనలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36 సొసైటీల్లో ఏర్పాటు చేసేందుకు సహకారశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అత్యధికంగా భూపాలపల్లి జిల్లాలో 10, జనగామలో ఏడు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయా జిల్లాల అధికారులు చెబుతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో



గార్ల, ధన్నసరి, నెల్లికుదురు, గూడూరు, ములుగు జిల్లాలో ములుగు, ఏటూరునాగారం, మంగపేట, గోవిందరావుపేట, వెంకటాపూర్, హనుమకొండ జిల్లాలో కమలాపూర్, ఎల్కతుర్తి, నందనం, ధర్మసాగర్, శాయంపేట, వరంగల్ జిల్లాలో చెన్నరావుపేట, అమీనాబాద్, ఊకల్, వర్ధన్నపేట, నల్లబెల్లి, జనగామ జిల్లాలో స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, జఫర్‌గఢ్, కళ్లెం, జనగామ, బచ్చన్నపేట, నర్మెట్ట సొసైటీల్లో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్న అధికారులు వాటి పేర్లను ప్రతిపాదిస్తూ సర్కారుకు పంపించారు.

తీరనున్న ఇబ్బందులుగ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు చాలా మంది ఉన్నారు. వైద్యం కోసం ఆసుపత్రులు చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి వారు మందుల కొనుగోలుకు అధిక మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చౌకగా లభించే జనరిక్ మందులను గ్రామీణ ప్రజల చెంతకు తీసుకువ స్తుంది. 'జన్ ఔషధి' పేరుతో ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో దుకాణాలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అనుకుంటున్నట్లుగానే త్వరలోనే ఈ కేంద్రాలను ప్రారంభిస్తే పల్లె ప్రజలకు ఆర్థిక కష్టాలు తీరనున్నాయి.

# ఉపాధి చూపని శిక్షణ!

ఏటూరునాగారం : గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. స్వల్పకాలికం పేరుతో ఐటీడీఏ అందిస్తున్న 2, 3 నెలల నిడివి గల ఉపాధి, ఉద్యోగ శిక్షణలు బతుకుదెరువుకు భద్రతనివ్వడం లేదు. శిక్షణ అనంతరం వివిధ రకాల ప్రైవేటు ఉద్యోగాల్లో చేరిన నిరుద్యోగులు వేతనాలు సరిపోక వెనక్కిమళ్లుతున్నారు. ప్రజాధనం వృథా అవుతోందే తప్ప ప్రయోజనం ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. ఐటీడీఏ గిరిజన నిరుద్యోగులకు యువజన శిక్షణ కేంద్రాలు(వైటీసీ) ద్వారా అందిస్తున్న ఉపాధి, ఉద్యోగ శిక్షణల వివరాలు చెప్పమన్నా అధికారులు గోప్యత పాటిస్తున్నారు.

ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏటూరునాగారం, జాకారం, కాటారం, వరంగల్ వైటీసీల్లో ప్రస్తుతం ఎలాంటి శిక్షణలు ఇవ్వడం లేదు. కేవలం ఒక్క మహబూబాబాద్ వైటీసీలో మినహా మిగతా చోట్ల రెండు సంవత్సరాలుగా ఎలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించకుండా ఖాళీగానే ఉంటున్నాయి. కారణం అడిగితే బడ్జెట్ లేదని అధికారులు సమాధానం చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించడంలో విఫలం

గిరిజన నిరుద్యోగులకు శిక్షణ పొందిన సంబంధిత కోర్సు ద్వారా ఉపాధికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ఐటీడీఏ అధికారులపై ఉంది. అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. 2015-16లో వైటీసీల ద్వారా శిక్షణలు ఇవ్వడం ప్రారంభించారు. సోలార్ టెక్నీషియన్, ఎం-బ్యూటీషియన్, కంప్యూటర్, హోటల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ అండ్ సేల్స్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అండ్ రిటేల్ సేల్స్, సెక్యూరిటీ గార్డ్ తదితర కోర్సుల్లో శిక్షణలు అందిస్తున్నారు. ఆయా రంగాల్లో శిక్షణ పొంది హైదరాబాద్ వంటి నగరాల్లో ఉద్యోగాలు పొందిన వారు ఎవరూ నిలదొక్కుకోవడం లేదు. వారికి రూ.10 వేల నుంచి రూ.15 వేల లోపే వేతనాలు ఇవ్వడం, ఎన్నేళ్లు పని చేసినా సంబంధిత రంగంలో వృద్ధి కనిపించకపోవడం లాంటి కారణాలతో అభ్యర్థులు ఉద్యోగం మానేస్తున్నారు.

2021-22 ఆర్థిక సంవత్సరంలో గ్రూప్స్, పోలీసు, అటవీశాఖ తదితర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే శిక్షణ ఇప్పించారు. లి ఈ సంవత్సరం మహబూబాబాద్ వైటీసీలో సోలార్ టెక్నీషియన్ కోర్సులో 31, హోటల్ మేనేజ్‌మెంట్‌లో 30, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్‌లో 30 మందికి శిక్షణ ఇస్తున్నారు. మిగతా వైటీసీల్లో ఎలాంటి శిక్షణలు ఇవ్వడం లేదు.

కొత్త కోర్సులు అవసరం

పారా మెడికల్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ప్లంబింగ్, శానిటరీ, భవన నిర్మాణ రంగాల్లో తప్పనిసరిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అద్భుతమైన కోర్సులున్నాయి. మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్, ఇమేజింగ్ టెక్నాలజీ, 6 నెలల లైబ్రరీ సైన్స్ సర్టిఫికేషన్ కోర్సు, అకౌంటింగ్ అండ్ ట్యాక్సింగ్, భూమి సర్వేయింగ్, సరికొత్త కంప్యూటర్ కోర్సులు వంటివి ఎన్నో ఉన్నాయి. కానీ స్వల్పకాలికం పేరుతో ఊరూ, పేరూ లేని కోర్సుల్లో శిక్షణ ఇప్పించి డబ్బు ఖర్చు చేస్తూ నిరుద్యోగ యువతకు ఎలాంటి భరోసా ఇవ్వకుండా చేస్తున్నారని గిరిజన యువత తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

వేతనం సరిపోక ఇంటికొచ్చా..అజ్మీరా కళ్యాణి, సంద్రగూడెం, గోవిందరావుపేట మండలంనేను కంప్యూటర్ అండ్ రిటేల్ సేల్స్ రంగంలో 2 నెలల శిక్షణ పొందాను. శిక్షణ పూర్తయిన తర్వాత హైదరాబాద్‌లోని రిలయన్స్ స్మార్ట్ స్టోర్‌లో సేల్స్ గర్ల్‌గా ఉద్యోగం ఇప్పించారు. రూ.11,500 నెలసరి వేతనం ఇచ్చేవారు. అవి ఎటూ సరిపోయేవి కావు. కుటుంబపరమైన ఇబ్బందుల కారణంగా 6 నెలల తర్వాత ఇంటికి తిరిగొచ్చాను.

ఆర్థిక ఇబ్బందులతో.. లావుడ్యా సందీప్, ములుగు

నేను కంప్యూటర్ అండ్ రిటేల్ సేల్స్‌లో 2 నెలల శిక్షణ పొందాను. అనంతరం రూ.14 వేల వేతనంతో హైదరాబాద్‌లోని పీవీఆర్ షాపింగ్‌మాల్‌లో ఉద్యోగం ఇప్పించారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు మా నాన్నకు ఆరోగ్యం బాగా లేక ఐదు నెలల తర్వాత ఇంటికి తిరిగొచ్చాను.

భరోసా లేదనిపించింది.. ఈక ఆకాష్, వెంగళాపురం, తాడ్వాయి మండలం ఫార్మా ఎగ్జిక్యూటివ్ కోర్సులో శిక్షణ పొందాను. హైదరాబాద్‌లోని మెడ్‌ప్లస్ సంస్థలో 10 నెలల పాటు రూ.12,500 వేతనంతో పని చేశాను. ఎన్ని రోజులు పని చేసినా భవిష్యత్తు లేదనిపించింది. అందుకే ఫొటోగ్రఫీ నేర్చుకుని ఉపాధి పొందాలనిపించింది. ఆర్థికంగా స్తోమత లేని కారణంగా సాయం కోసం ఎదురు చూస్తున్నా.శిక్షణ కార్యక్రమాల్లో మార్పులు చేయాలి.. మేకల రాజేందర్, ఖమ్మంపల్లి, మహాముత్తారం మండలంనాన్న లేరు. కుటుంబ బాధ్యతలు నేనే చూసుకోవాలి. ఫార్మా అసిస్టెంట్ అండ్ సేల్స్ కోర్సులో శిక్షణ ఇచ్చి రూ.14 వేల వేతనంతో ఉద్యోగం ఇప్పించారు.

# గుండెల్లో పేలుళ్లు!



జయశంకర్ : భూగర్భాన ఉన్న నల్లబంగారం వెలికితీసి సింగరేణి దేశానికే వెలుగులు నింపుతోంది. ఎందరికో ఉపాధి కల్పిస్తోంది.. కానీ, స్థానికుల బతుకుల్లో చీకట్లు నిండుతున్నాయి. ఉపరితల గనుల్లో బాంబుల మోతతో పరిసర ప్రాంతమంతా దద్దరిల్లుతోంది. ఇళ్ల పునాదులు సైతం కుదుపునకు గురవుతున్నాయి. భూపాలపల్లి ఏరియాలోని కాకతీయ ఓసీ-3కి సమీపంలో గుర్రంపేట ఎస్సీ కాలనీవాసులు నిత్యం కష్టాలు ఎదుర్కొంటున్నారు. గనికి సమీపంలోనే ఉండటంతో భారీ శబ్దాలకు ఉలిక్కిపాటుకు గురవుతున్నారు. సమీప ప్రాంతాల్లోకి దుమ్ము, ధూళీ, దుర్వాస వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేలుళ్లతో దినదిన గండంగా కాలం వెల్లదీస్తున్నారు. కాలనీలో ఇళ్ల గోడలు పగుళ్లుబారుతున్నాయి.. పైకప్పులు ధ్వంసమవుతున్నాయి. పేలుడు ధాటికి ఇళ్లలోని సామాన్లు, వస్తువులు కిందపడుతున్నాయి. గతేడాది పేలుడు ధాటికి ఓ కొట్టం నేలమట్టమైంది. దాంట్లో ఉన్న గేదె మృత్యువాత పడింది. అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలనీలో దాదాపు అందరూ నిరుపేదలే.. దగ్గు, దమ్ము, ఆస్తమా లాంటి వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. కాలనీలో భూగర్భ నీటిమట్టం కూడా తగ్గిపోతోందని స్థానికులు చెబుతున్నారు.

ఉపాధికి దూరం..

గుర్రంపేట ఎస్సీ కాలనీవాసులు ఉపాధికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 600 మంది వరకు ఉన్నారు. దాదాపు వందకు పైగా కుటుంబాల వరకు ఇక్కడ నివాసం ఉంటున్నాయి. కాలనీ సమీపంలోని గణపురం మండలం మాధవరావుపల్లి, కొండంపల్లిలకు వ్యవసాయ కూలీ పనులకు వెళ్లేవారు. ఆయా గ్రామాల్లోని వ్యవసాయ భూములు ఓసీ-3 కోసం సింగరేణి తీసుకుంది. దీంతో ఇప్పుడు కాలనీవాసులు ఉపాధి దొరక్క ఇబ్బందులు పడుతున్నారు.

ఇళ్లు కూలుతున్నాయ్..: -దూడపాక అరవింద్

ఓసీ-3కి మా ఎస్సీ కాలనీ సమీపంలో ఉంది. గనిలో పేలుళ్లకు గోడలు పగుళ్లు బారుతున్నాయి. ఇళ్లు కూలిపోతున్నాయి. ఆకస్మిక శబ్దంతో మా గ్రామానికి చెందిన ఒకరు గుండెపోటుతో మృతిచెందారు. మా సమస్యలు సింగరేణి అధికారులు గుర్తించి పరిష్కరించాలి.

కూలి దొరకడం లేదు.. : - రత్నం సరోజన

మా సమీప గ్రామాల భూములు ఓసీపీలో కోల్పోవడంతో గ్రామంలో కూలీలకు ఉపాధి దొరకడం లేదు. ఇళ్లలోనే ఉంటున్నాం. పేలుళ్ల సమయంలో ఇళ్లు కూలిపోతాయని భయంగా ఉంటోంది. రేకులు పగిలిపోతున్నాయి.

జాగ్రత్తలు తీసుకుంటున్నాం: - శ్రీనివాసరావు, జీఎం, సింగరేణి

ఓసీ-3లో పేలుళ్ల సమయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం.. సమీప గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పేలుళ్లు జరుపుతున్నాం. ఇందుకోసం అదనపు ఖర్చయినా వెచ్చిస్తున్నాం. గోడలకు పగుళ్లు, ఇళ్లు కూలిపోవడానికి పేలుళ్లు కారణం కాకపోవచ్చు. గ్రామస్థులకు సందేహాలుంటే శబ్ద తీవ్రతను తెలిపే పరికరాలను ఏర్పాటు చేసి నివృత్తి చేస్తాం.

# సౌకర్యాలు కరవు.. సమస్యల దరువు



జనగామ : జిల్లాలోని పలు సంక్షేమ వసతిగృహాలు సమస్యల నిలయాలుగా మారాయి. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ప్రభుత్వ వసతిగృహాల్లో సమస్యలను పట్టించుకునే వారు కరవయ్యారు. దీంతో ప్రభుత్వ హాస్టళ్లలో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని పలు ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో సౌకర్యాలు, సమస్యలపై పరిశీలన చేపట్టింది. ఆ వివరాలివి..

ఇలా చేయాలి

గురుకులాల్లో నెలకొన్న సమస్యలకు అధికారుల పర్యవేక్షణ లోపమని పలువురు భావిస్తున్నారు. ప్రతిరోజూ అధికారుల పర్యవేక్షణ ఉండాలి. ఆహార నాణ్యతను పరిశీలించేందుకు జిల్లా కమిటీని ఏర్పాటు చేయాలి. గురుకులాల్లో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీని కూడా ఏర్పాటు చేయాలి. తల్లిదండ్రుల కమిటీ నిర్ణయించిన తేదీల్లో కాకుండా మిగతా సమయాల్లోనూ ఆకస్మికంగా తనిఖీలు చేయాలి. నిర్వాహకులు సైతం పరిశీలించాలి. నెలకోసారైనా రీజినల్ కోఆర్డినేటర్ జిల్లాలోని గురుకులాల్లో పరిస్థితులపై ఆరా తీయాలి. కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆయా సంక్షేమ శాఖలకు సంబంధించిన అధికారులు ఏదో ఒక హాస్టల్‌ను సందర్శించాలి.

గదుల కొరత

జనగామలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 640 మందికి గాను 500 మంది విద్యార్థులు ఉన్నారు. 8, 9 తరగతుల విద్యార్థులకు డార్మిటరీ గదుల కొరత ఉంది. మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. కొన్ని మరుగుదొడ్లకు తలుపులు లేవు, మరికొన్నింటి తలుపులు విరిగిపోవడంతో విద్యార్థులు వాడడం లేదు. ఆరుబయటే చన్నీళ్లతో సాన్నం చేస్తున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. పాఠశాల ప్రహరీ కూలిపోవడంతో విద్యార్థులకు రక్షణ కరవైంది. గతేడాది ఈ గురుకులాన్ని సందర్శించిన కలెక్టర్.. మరమ్మతులకు కావాల్సిన నిధులను అంచనా వేయాలని ఈఈని ఆదేశించారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని నిర్వాహకులు చెప్పారు.జనగామ అర్బన్

కూలేందుకు సిద్ధంగా వంటశాల పాలకుర్తిలోని ఎస్సీ బాలుర వసతిగృహం దశాబ్దాలుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. 100 మంది విద్యార్థులకు సరిపడా మంచాలు, సదుపాయాలున్నా.. ప్రస్తుతం 10 మంది మాత్రమే ఉన్నారు. వంటశాల కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో నిత్యం వంట సిబ్బంది బిక్కు బిక్కుమంటూ వంట చేస్తున్నారు. మరుగుదొడ్డి ఒక్కటే ఉంది. దీంతో ఆరుబయట ఉన్న నీటితొట్టినే విద్యార్థులు స్నానానికి ఉపయోగించుకుంటున్నారు. దుస్తులు ఉతికేందుకు, ఇతర అవసరాలకు దీన్నే వాడుతున్నారు. కొత్తగా ప్రవేశాలు పొందిన మరో 20 మంది విద్యార్థులు ఇంత వరకు రాలేదు. పాలకుర్తి

శిథిలావస్థలో మరుగుదొడ్డి

బచ్చన్నపేటలోని ఎస్సీ వసతిగృహంలో 22 మంది విద్యార్థులు ఉన్నారు. గతేడాది 15 మంది విద్యార్థులు ఉండగా.. ఈ సంవత్సరం 22 మంది ఉన్నారు. వసతిగృహంలోని మరుగుదొడ్డి శిథిలావస్థలో ఉంది. వసతిగృహం వెనుక పిచ్చి మొక్కలు పెరగడంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. తాగునీటిని బయట కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నారు. ఈ ఏడాది దుస్తులు, సబ్బుల బిల్లులు, దుప్పట్లను ఇంకా పంపిణీ చేయలేదని విద్యార్థులు తెలిపారు. బచ్చన్నపేట

మరమ్మతుకు గురైన వాటర్ ప్లాంటు

జఫర్‌గఢ్‌లోని ఎస్సీ బాల, బాలికల వసతిగృహాలకు సొంత భవనాలు ఉన్నాయి. ఎస్సీ బాలుర గృహంలో గతేడాది 16 మంది విద్యార్థులుండగా ఈ ఏడాది కేవలం 12 మందే ఉన్నారు. ఎస్సీ బాలికల వసతిగృహంలో గతేడాది 23 మంది ఉండగా.. ఈ ఏడాది 18 మంది మాత్రమే ఉన్నారు.

ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థుల స్నానానికి వేడినీటి కోసం వాటర్ హీటర్ ప్లాంట్ ఏర్పాటు ఏర్పాటు చేశారు. కోతుల ఆగడాలతో అవి దెబ్బతిన్నాయి. ఇప్పటి వరకు వాటికి మరమ్మతు చేయకపోవడంతో విద్యార్థులు చన్నీళ్లతో స్నానం చేస్తున్నారు. ఎస్సీ బాలికల వసతిగృహంలో మినరల్ వాటర్ ప్లాంటు పాడైపోయింది. దీంతో పంచాయతీ సరఫరా చేసే నీటినే విద్యార్థినులు తాగుతున్నారు. దీనిపై వార్డెన్‌ను వివరణ కోరగా జిల్లా అధికారులకు సమాచారమందించామని, త్వరలో మరమ్మతులు చేయిస్తామన్నారు.జఫర్‌గఢ్

ఉన్నతాధికారులకు నివేదించాం..

కనగాల శ్రీనివాసరావు, జిల్లా సమన్వయ అధికారి

సాంఘిక సంక్షేమ గురుకులాల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది. ఈ ఏడాది కూడా ప్రవేశాలు బాగానే వచ్చాయి. గతేడాదితో పోలిస్తే కాస్త తక్కువ ప్రవేశాలు జరిగాయి. ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ ప్రవేశాలు చేపట్టాం.

# మోడికుంటకు తొలగిన అడ్డంకులు

జయశంకర్ : మన్యం వాసుల దశాబ్దాల కల మోడికుంట ప్రాజెక్టు.. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎట్టకేలకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతించడంతో అడ్డంకులు తొలగి పనులు పట్టాలెక్కించడానికి అడుగులు పడుతున్నాయి. ములుగు జిల్లా వాజేడు మండలంలోని మోడికుంటవాగు ప్రాజెక్టు, ఆదిలాబాద్ జిల్లాలోని గూడెం ఎత్తిపోతల పథకానికి గోదావరి యాజమాన్య బోర్డు గత జనవరిలోనే ఆమోదం తెలిపింది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతి కోసం సిఫారసు చేసింది. దిల్లీలో జరిగిన సాంకేతిక సలహా కమిటీ(టీఏసీ) సమావేశంలో గూడెంతో పాటు మోడికుంటవాగు ప్రాజెక్టుకు కూడా అనుమతి ఇచ్చింది. దీంతో ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమమైంది.

35 గ్రామాల్లో 13,750 ఎకరాలకు సాగునీరు..



ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 2.07 టీఎంసీలు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.500.26 కోట్లు. ప్రాజెక్టు ద్వారా వానాకాలం 13,750 ఎకరాలకు, యాసంగిలో 1850 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణమైతే పరోక్షంగా, ప్రత్యేక్షంగా ఉపాధి కలుగుతుంది. మోడికుంట ప్రాజెక్టుతో వాజేడు మండలంలోని 35 గ్రామాలకు సాగునీరు, తాగునీరు అందనుంది. ప్రాజెక్టు నిర్మాణాన్ని జులై 18, 2006న ప్రార్భభించి జులై 17, 2008న పూర్తిచేయాలని ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం నిర్ణయించినా పలు అడ్డంకులు ఎదురయ్యాయి. అటవీశాఖ, పర్యావరణ అనుమతుల జాప్యం, గోదావరి బోర్డు, సీడబ్ల్యూసీ అనుమతుల్లో కాలయాపన జరిగింది. ఎట్టకేలకు ప్రధానమైన సీడబ్ల్యూసీ అనుమతులు రావడంతో ఇక అన్ని అడ్డంకులు తొలగిపోయినట్లేనని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

అటవీశాఖ, పర్యావరణ అనుమతులు రాగానే..

ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాలు చెప్పింది. దీనికి సీడబ్ల్యూసీ అడిగిన సందేహాలను రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు నివృత్తి చేశారు. ఆ తర్వాత సీడబ్ల్యూసీ తుది నిర్ణయం తీసుకుంది. ఇక రెండోదశ అటవీ అనుమతులు, పర్యావరణ అనుమతులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని కూడా రెండు మూడు నెలల్లో తీసుకుంటామని నీరుపారుదశాఖ అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత టెండర్లు పిలిచి పనులు చేపడతారు. ఇదంతా దాదాపు ఈ ఏడాది ఖరులోగా అయ్యే అవకాశం ఉంది.

# ఉద్యాన పంటకు ఉపాధి ఊతం

పెద్దపల్లి : పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా కూరగాయలు, పండ్ల ఉత్పత్తి లేక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దిగుబడులు తగ్గడంతో మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది. మరోవైపు నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో ఏటికేడు వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వరికి ప్రత్యామ్నాయంగా పండ్లు, కూరగాయల తోటల సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. సన్న, చిన్నకారు రైతులకు రాయితీ కల్పించింది. గతంలో మామిడి, జామ, దానిమ్మ తోటల పెంపకం చేపట్టగా పెద్దగా ప్రతిఫలం రాలేదు. ఈసారి బిందు సేద్యంలో 13 రకాల పంటల సాగుకు అవకాశం కల్పించారు. ఈ నెలాఖరులోగా లబ్ధిదారులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. నాలుగేళ్ల వరకు నిర్వహణ ఖర్చులను ప్రభుత్వమే భరించనుంది.

నాలుగేళ్ల వరకు బాధ్యత

పండ్ల తోటల సంరక్షణ బాధ్యతను నాలుగేళ్ల వరకు ప్రభుత్వమే చూస్తుంది. మొక్కలకు మామిడికి రూ.30, బత్తాయి రూ.44, నిమ్మ రూ.25, సపోట రూ.37, జీడిపప్పు రూ.24, సీతాఫలం రూ.26, ఆపిల్ బేర్ రూ.51, దానిమ్మ రూ.24, కొబ్బరి రూ.26, జామ రూ.31, మునగ రూ.15, అల్లనేరేడు రూ.25 చొప్పున ఒక్కో మొక్కకు చెల్లించనున్నారు. ఎరువులకు ఒక్కో మొక్కకు రూ.50, నిర్వహణ ఖర్చు కింద రూ.10 చొప్పున చెల్లించడంతో పాటు ఉపాధిహామీ కూలీలతో గుంతల తవ్వకం, మొక్కలు నాటే పనులు చేపడతారు. మొక్కలు నాటిన ఏడాది నుంచి మొత్తం నాలుగేళ్లు నిర్వహణ ఖర్చులు మంజూరు చేస్తారు.

రాయితీపై బిందు సేద్యం పరికరాలు

రాయితీ పండ్ల తోటల పథకానికి ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగి ఉండి, అయిదెకరాలలోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హులు. సాగునీటి వసతి కలిగి ఉండాలి. ఈసారి కొత్తగా బిందు సేద్యంపైనా రాయితీ కల్పించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, మిగిలిన సామాజిక వర్గాల రైతులకు 90 శాతం రాయితీపై పరికరాలు పంపిణీ చేస్తారు. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ 1000, జగిత్యాల 1320, పెద్దపల్లి 1065, రాజన్నసిరిసిల్ల 1040 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాల వారీగా లక్ష్యాలు కేటాయించడంతో లబ్ధిదారులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

నెలాఖరులోగా లబ్ధిదారుల గుర్తింపు

ఉమ్మడి జిల్లాలో 4,425 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల సమన్వయంతో లక్ష్యాలు అధిగమించేలా కార్యాచరణ రూపొందించారు. ఈ నెలాఖరు వరకు లబ్ధిదారుల గుర్తింపు, ఆగస్టు 15లోగా ప్రతిపాదనలు రూపొందించనున్నారు. వచ్చే నెలాఖరులోగా మొక్కలు నాటడం, బిందు సేద్యం పరికరాల బిగింపు పనులు పూర్తి చేయనున్నారు. పండ్ల తోటల పెంపకం ఆధారంగా ఒక్కో ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు మంజూరు చేస్తున్నారు.

13 రకాల తోటలు

ఉపాధిహామీలో ఉద్యాన పంటల సాగుకు పెద్దపీట వేస్తున్నారు. అయితే పెట్టుబడి వ్యయం అధికం కావడంతో సన్న, చిన్నకారు రైతులు ఆసక్తి ఉన్నా ముందుకు రావడం లేదు. ఉమ్మడి జిల్లాలో సారవంతమైన నేలలున్నా సాగు తక్కువగా ఉంటోంది. ప్రస్తుతం మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, సీతాఫలం, సపోట, జీడిపప్పు, మునగ, డ్రాగన్‌ఫ్రూట్, అల్లనేరేడు, ఆపిల్‌బేర్, దానిమ్మ, కొబ్బరి రకాల పంటలు సాగు చేయాలని నిర్ణయించారు.

# కరంటు వైరు కాటేస్తుంది సుమా!

ఖమ్మం : వర్షాకాలంతోపాటే విద్యుత్తు ప్రమాదాలు పొంచి ఉంటాయి. కొద్దిపాటి నిర్లక్ష్యంతో ఏటా ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారు ఎందరో.. కాస్త అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటిస్తే విలువైన ప్రాణాలు కాపాడుకోవచ్చంటున్నారు విద్యుత్తురంగ నిపుణులు. వర్షాకాలంలో జరిగే ప్రమాదాలపై జాగరూకతతో వ్యవహరించాలంటున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరుగుతున్న ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం..ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 11 లక్షలకుపైగా విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో సుమారు 1.6 లక్షలు వ్యవసాయ కనెక్షన్లు. జోరుగా గాలి వీచినప్పుడు, వర్షాకాలంలో తీగలు తెగడం, పంటకు రక్షణగా కంచెకు విద్యుత్తు పెట్టడం, జంతువులను, చేపలను వేటాడేందుకు ఏర్పాటు చేసిన తీగలు తగలి ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఇళ్లలో దండేలు, కేబుల్ వైర్లకు సరఫరా జరిగి, తడి చేతులతో ఉపకరణాలు పట్టుకోవడంతో విద్యుదాఘాతాలు సంభవిస్తున్నాయి.

ఇటీవల జరిగిన ఘటనలు... కామేపల్లి మండలం బర్లగూడెంలో ఇంట్లో జరిగిన ప్రమాదంలో విద్యుదాఘాతంతో సపావత్ సంగీత(25) మృతి చెందారు.అన్నపురెడ్డిపల్లిలో వ్యవసాయ విద్యుత్తు నియంత్రికపై ఫ్యూజ్ వేసేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో పోలూరి రాజశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. మధిరలో వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతంతో కొణతం రామచంద్రరావు(59), కంభం అనిల్(21) మృతి చెందారు. రఘునాథపాలెం మండలం చిమ్మపూడిలో మేత మేసేందుకు వెళ్లి తెగిపడిన తీగ తగిలి మూడు పాడి గేదెలు మృతి చెందాయి.

సమాచారం ఇద్దాం...తెగిన, వేలాడే విద్యుత్తు తీగల గుర్తించిన వెంటనే టోల్ ఫ్రీ నెంబరు:1800 425 0028, హెల్ప్‌లైన్ 1912కు సమాచారం అందించాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి ... వర్షాలు కురిసిన సమయంలో, చిత్తడిగా



ఉన్న ప్రాంతంలో ఉన్న ఇనుప స్తంభాలను, స్తంభాల స్టేవైర్లను ముట్టుకోకూడదు. విద్యుత్తు సరఫరాకు ఆధునిక పరికరాలు అమర్చుకోవాలి. ప్లాస్టిక్ స్టార్టర్ బాక్సులు ఏర్పాటు చేసుకోవాలి. మంచి వైరింగ్, ఎర్తింగ్ తప్పనిసరి. వర్షాలు పడినప్పుడు తెగిపడిన విద్యుత్తు తీగలు, విరిగిన స్తంభాలను ముట్టుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని గుర్తించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలి. వేలాడుతున్న తీగలు, స్తంభాలపై తీగల కాసారం వద్ద పక్షులు, ఉడతలు గూళ్లు పెట్టినట్లు గుర్తిస్తే విద్యుత్తు అధికారులకు తెలియజేయాలి. అనుమతి లేకుండా ప్రయివేటు వ్యక్తులు నియంత్రికల పైకి ఎక్కి తీగలు సరి చేయడం, మరమ్మతు చేయడం, సర్వీసు వైర్లు మార్చడం చేయకూడదు వ్యవసాయ పంపుసెట్ల వద్ద సర్వీసు, స్టే, ఎర్త్ వైర్లుగా నాణ్యమైన ఇన్సులేషన్ ఉన్నవి వినియోగించాలి. వాటిని ఎప్పటికప్పుడు గమనించాలి. పొలం కంచెకు స్టేవైర్లు, ఎర్త్ వైర్లు తగలకుండా చూసుకోవాలి. ఫ్యూజులు, స్టార్టర్ బోర్డులు నేలకు 5 అడుగుల ఎత్తులో ఉండేలా ఏర్పాటు చేసుకుంటే మంచిదితరచూ ఫ్యూజు పోతోందని నేరుగా కనెక్షను ఇవ్వకూడదు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. వెంటనే కొత్త ఫ్యూజు అమర్చుకోవాలి. ఇనుప రేకులకు తగిలేలా సర్వీసు వైర్లను, స్టే వైర్లను కట్టుకోకూడదు.దుస్తులు ఆరేసేందుకు ఉపయోగించే దండెంగా తాడు, ఇన్సులేషన్ ఉన్న తీగను ఉపయోగించాలి. విద్యుత్తు తీగలకు దగ్గరగా కట్టకూడదు. సెల్‌ఫోను ఛార్జింగ పెట్టి మాట్లాడకూడదు. తడి శరీరంతో ఛార్జింగ్ పెట్టకూడదు. ఎవరికైనా విద్యుదాఘాతం తగిలితే రక్షించాలనే ఆతృతతో ముట్టుకోవద్దు. విద్యుత్తు సరఫరాను నిలిపివేయాలి. లేదా వైరును కర్రతో కొట్టాలి. భారీగా గాలులు వీచిన సమయంలో తీగలు తెగి పడుతుంటాయి. వాహనదారులు చూసుకొని ప్రయాణించాలి. అప్రమత్తంగా ఉండాలి. పంట పొలాల రక్షణ కంచెలకు విద్యుత్తు కనెక్షను ఇవ్వవద్దు. సోలార్ ఫెన్సింగ్ ఉపయోగించుకోవచ్చు. అప్రమత్తంగా ఉంటే మేలు నిర్లక్ష్యం, అవగాహన లేక విద్యుత్తు ప్రమాదా లు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రజలు జాగ్రత్తలు పాటిస్తే అనేక ప్రమాదాలను నివారించి, ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఏదైనా ఘటన ను గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలి.ఎ.సురేందర్, ఎస్ఈ, ఖమ్మం

# పీజీ కళాశాలల భూములకు.. భద్రత కరవు

ఖమ్మం : ఖమ్మం నగరం నడిబొడ్డున రూ.కోట్ల విలువైన భూమి ఆక్రమణకు గురవుతోంది. కాకతీయ విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాలకు చెందిన ఈ భూమి ఆక్రమణదారుల చెర నుంచి బయటపడటం లేదు. ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతంలోని బైపాస్ రోడ్డు పక్కనే ఈ భూమి ఉంది. రస్తోగినగర్‌కు వెనక వైపు ఉన్న కొంతమంది ఇటువైపు దుకాణ సముదాయాలను, ఇళ్లను నిర్మించుకుని ఎదురుగా ఉన్న కళాశాల భూమిని ఉపయోగించుకుంటున్నారు. మరి కొంతమంది వాహనాలకు ఈ స్థలం అడ్డాగా మారింది. కొద్దిరోజులు ఇదే పరిస్థితి కొనసాగితే.. పూర్తిగా భూమి కబ్జాదారుల కబంధహస్తాల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని కళాశాల యాజమాన్యం ఆందోళన వ్యక్తం చేస్తోంది. అనేక మంది ఈ భూమిలో పాగా వేశారు.

కలెక్టర్‌కు వర్సిటీ రిజిస్ట్రార్ ఫిర్యాదు

రోడ్డు పక్కనే ఉన్న భూమి చాలా వరకు ఆక్రమణదారుల చెరలో ఉండటంతో స్వయంగా కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ దీనిపై చర్య తీసుకోవాల్సిందిగా మే 19న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు సైతం ఈ విషయమై కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 1991-92లో ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పీజీ కళాశాల ప్రత్యేకంగా ఏర్పాటైంది. పీజీ కళాశాల కోసం మొత్తం 10.38 ఎకరాలు కేటాయించారు. ఇందులో కొంత పురావస్తుశాఖ పరిధిలో ఉంది. 2001లో బైపాస్ రోడ్డు నిర్మాణానికి కళాశాల పక్కనున్న రెండెకరాల స్థలం సేకరించారు. ఇలా చాలా వరకు తరిగిపోగా కేవలం 7.27 ఎకరాలు మాత్రమే మిగిలింది. ఇప్పుడున్న స్థలానికి సైతం భద్రత కరవైంది. ప్రధానంగా బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న స్థలంలో కబ్జాదారులు పాగా వేశారు. దీనిపై కళాశాల యాజమాన్యం నగరపాలక సంస్థ అధికారులకు సైతం వినతిపత్రం అందజేసింది. ఆక్రమణదారులు స్థలాన్ని ఖాళీ చేస్తేనే కళాశాలకు సంబంధించి విద్యార్థులు, విద్యార్థినుల కోసం ప్రత్యేకం వసతి గృహాలు నిర్మించే అవకాశం ఉంటుంది.

# సర్దుకుపోవడం సాధ్యమేనా..!



చర్ల : చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులో సిబ్బంది లేమి ఎప్పటిలాగానే ఇబ్బందులు సృష్టించేలా ఉంది. ఏటా వర్షాల సమయంలో ప్రాజెక్టు నిర్వహణతోపాటు కాల్వల సాగునీటి విడుదలకు తగినంత మంది సిబ్బంది లేరు. సగమైనా లేకపోవడంతో ఏటా తిప్పలు తప్పడంలేదు. ప్రాజెక్టులో సిబ్బంది నియామకంపై ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపిస్తున్నా కొన్నేళ్లుగా ఖాళీలు భర్తీకు నోచుకోవడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ సిబ్బంది నియామకానికి నిధుల లేమి అడ్డంకిగా మారుతోంది. ఫలితంగా ఏటా ఖరీఫ్‌లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలం, వరదల సమయంలో కొద్ది మందితోనే కాలం నెట్టుకురావడం ఇబ్బందిగా మారుతోంది. ఈనెల 11న జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం కేసీఆర్ వీఆర్ఏల సర్దుబాటుపై సమీక్షించారు. జలవనరుల శాఖలో లస్కర్లు, సహాయకులను సర్దుబాటు చేసే అవకాశం ఉండటంతో ప్రాజెక్టులో సిబ్బంది నియామకంపై ఆశలు రేకెత్తుతున్నాయి. ప్రాజెక్టులో సిబ్బంది సమస్య ఉండటంతో కాలువ మీద పని చేసే లస్కర్లను సైతం ప్రాజెక్టులో పనులకు వినియోగిస్తున్నారు. కనీసం వర్షాకాలంలోనైనా తాత్కాలిక సిబ్బందిని నియమిస్తే దశాబ్దాల కష్టాలకు పరిష్కారం లభిస్తుందని రైతులు పేర్కొంటున్నారు. 3 షిఫ్టులకు 24 మంది సిబ్బంది అవసరం ఉండగా కేవలం 9 మందితో నెట్టుకురావడం కష్టసాధ్యమవుతోంది. ఇద్దరు మినహా (ఎలక్ట్రీషియన్లు) సాంకేతిక సిబ్బంది లేకుండటంతో గేట్ల ఆపరేషన్‌తో పాటు సాగునీటి విడుదల ఏటా అధికారులకు తలనొప్పిగా మారుతోంది.

వరద ప్రవాహ సమయంలో గేట్లు ఎత్తేందుకు హయస్టు వంతెనపై కనీసం ముగ్గురు, కింద మరో ముగ్గురు ఉండాలి. ప్రతి షిఫ్టునకు కనీసం ఆరుగురు అవసరం. కానీ కేవలం ముగ్గురే ఉన్నారు. వీరిలో ఎవరు విధులకు రాకున్నా వరదలప్పుడు గేట్లెత్తే దిక్కుండదు. అరకొర సిబ్బంది హైరానా పడాల్సి వస్తుంది. 25 గేట్లకు సంబంధించి బ్రేకర్లన్నీ పనిచేయక పోవడంతో వాటిని ఎత్తాలంటే కష్టంగా ఉంటోందని సిబ్బందిపేర్కొంటున్నారు.కాల్వలపై ఇలా..ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన ఎడమ, కుడికాల్వల పరిధిలో 37 డిస్ట్రిబ్యూటర్లకు 29 మంది లస్కర్లకు కేవలం నలుగురే ఉండటంతో సాగునీటి విడుదల పర్యవేక్షణ కష్టంగా మారుతోంది. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో 24,700 ఎకరాలకు సాగునీటి సరఫరా జరుగుతోంది. అధ్వాన కాల్వలపై ఎప్పుడు బుంగలు పడతాయో తెలియని పరిస్థితుల్లో సాగునీటి విడుదలలో ఇబ్బందులు తప్పడం లేదు.సిబ్బంది ఖాళీలపై ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతం ప్రాజెక్టులో 9 మంది సిబ్బంది, కాల్వలపై వర్క్‌ఇన్‌స్పెక్టర్‌తో సహా నలుగురు లస్కర్లు ఉన్నారు. ప్రభుత్వం వీఆర్ఏల సర్దుబాటుకు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. వారిని నియమిస్తే వెసులుబాటు కలుగుతుంది.డీఈ తిరపతి

# విశవ పరీక్ష




భద్రాచలం: కుటుంబ సభ్యులు మృతి చెందిన పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబీకులకు శవపరీక్ష విషమ పరీక్షే అవుతోంది. కాలం మారుతున్నా ఆయా ప్రాంతవాసుల సమస్యల్లో మార్పు రావడంలేదు. పాత విధానాలనే పాటిస్తుండటంతో వారికి వ్యయప్రయాసలు ఎదురవుతున్నాయి. మృతదేహాలను మార్చురీకి తరలించే వాహనాలకు సాధారణంగా అధిక డిమాండ్ ఉంటుంది. దూరం ఎక్కువైతే ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. శవపరీక్ష పూర్తి చేసుకుని వచ్చేసరికి ఎక్కువ సమయం పడ్తుండటంతో అంత్యక్రియలకు ఆలస్యం అవుతోంది. ఇది బాధిత కుటుంబాలను మరింత బాధిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సీహెచ్‌సీలుగా స్థాయి పెంచారు. వాటిలో మార్చురీలు ఏర్పాటు చేయాలని నిబంధన ఉంది. కానీ ఇంకా కార్యరూపం దాల్చలేదు.

..ఇలాంటి దయనీయ పరిస్థితులు ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలను ఇంకా వీడలేదు. హత్యలు, ఆత్మహత్యలు, ప్రమాదాలు, అనుమానాస్పదస్థితిలో మృతి చెందితే శవపరీక్ష చేయించేందుకు బాధిత కుటుంబాలు పడే బాధలు వర్ణనాతీతం. అసలే కుటుంబ సభ్యులు పోయిన బాధలో ఉన్నవారికి వాహన ఖర్చుల భారంతోపాటు కాలహరణం జరుగుతోంది..

ఇక్కడ సమస్య తొలగింది..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక, కరకగూడెం మండలాల నుంచి 70 కి.మీ. దూరంలోని భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో శవపరీక్షలు నిర్వహించేవారు. వీరి బాధలు గుర్తించిన అధికారులు ఎట్టకేలకు 20 కి.మీ. దూరంలోని మణుగూరు ఆస్పత్రికి మార్పిడి చేశారు. దీంతో ఎన్నో కుటుంబాలకు వ్యయప్రయాసలు తగ్గాయి.

భద్రాద్రి కొత్తగూడెం చర్ల మండలంలో వివిధ కారణాలతో ఎవరైనా మృతి చెందితే శవపరీక్ష కోసం 60 కిలోమీటర్ల దూరంలోని భద్రాచలం ఆస్పత్రికి తరలించాల్సి వస్తోంది. మార్గమధ్యలో 30కి.మీ. దూరంలోని దుమ్ముగూడెంలో మార్చురీ ఉన్నా వైద్యులు, సిబ్బంది కొరత వల్ల బాధలు తప్పడంలేదు. దీంతో పేద వర్గాలు వాహన ఖర్చులకు అధికంగా వెచ్చించాల్సి వస్తోంది.

ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లికి చెందిన జల్లి కృష్ణయ్య(58) ఈనెల 5న ద్విచక్రవాహన ప్రమాదంలో తలకు తీవ్రగాయాలై మృతి చెందారు. శవపరీక్ష కోసం మృతదేహాన్ని మిట్టపల్లి నుంచి మధిరకు తీసుకువెళ్లడం భారంగా మారడంతో పాటు అధిక సమయం కేటాయించాల్సి వచ్చింది.

మార్చురీ కేంద్రాన్ని మార్చాలి

వివిధ కారణాలతో మరణిస్తే శవపరీక్ష కోసం మధిర మార్చురీ కేంద్రానికి తీసుకువెళ్లడం సమస్యగా మారింది. మృతదేహాలను తీసుకెళ్లేందుకు ప్రైవేటు వాహనదారులు అధిక మొత్తం డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఆర్థికభారంతోపాటు ఎక్కువ సమయం పడుతోంది. నిరుపేద కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే శవపరీక్షకు అయ్యే ఖర్చులను కూడా భరించలేని పరిస్థితి. సమీపంలో ఉన్న పెనుబల్లి, ఖమ్మం ఆసుపత్రులలో శవపరీక్షలు చేసేలా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారు లు చర్యలు తీసుకోవాలి.

గోవిందు శ్రీనివాసరావు, అన్నారుగూడెం, తల్లాడ

సీహెచ్‌సీల్లో ఏర్పాటు చేస్తున్నాం

నేలకొండపల్లి, కల్లూరు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో మార్చురీలు సిద్ధం అవుతున్నాయి. త్వరలో సిబ్బందిని కూడా నియమిస్తారు. తిరుమలాయాపాలెం సీహెచ్‌సీలో ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశాం.డా.బి.వెంకటేశ్వర్లు, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి, ఖమ్మం

# పాపం అన్నందుకు భారీ మూల్యం

ఖమ్మం : గంజాయి అలజడి ఖమ్మం నగరంలో పెచ్చుమీరింది. పట్టుబడినా క్షణాల్లో బయట పడతామనే ధీమా పెరిగింది. కఠినమైన కేసులు లేవు. స్టేషన్ బెయిల్ విధానంలో బయటపడుతున్నారు. క్రమంగా స్టేషన్లకు గంజాయి నిందితులను పట్టుకొచ్చేందుకు ఎక్సైజ్ సిబ్బంది సైతం వెనకంజ వేస్తున్నారు. వెరసి ఖమ్మం నగరంలో గంజాయి మత్తులో ఎప్పుడు ఎక్కడ దాడి చేస్తారో అన్న భయాందోళనలు పెరిగాయి. ఖమ్మం నగరం, శుక్రవారపేట ప్రాంతానికి చెందిన ఓ నిందితుడిని ఆబ్కారీ పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు తిప్పలు పడ్డారు. నిందితుడు ఇప్పటికే నాపై హత్య కేసు ఉంది మీ ఇష్టం అంటూ వెళ్లిన తనిఖీ బృందాన్ని బెదిరించాడు. అతడిని అదుపులోకి తీసుకునేందుకు ఆబ్కారీ పోలీసులు నానా తంటాలు. తీసుకొచ్చిన మరుక్షణమే అతన్ని విడిచి పెట్టాలనే ఒత్తిళ్లు వచ్చాయి.ప్రకాశ్‌నగర్ వంతెన సమీపంలో గంజాయి ముఠాలు ఉన్నాయనే అనుమానంతో ఆబ్కారీ సిబ్బంది అక్కడికి వెళ్లింది. అక్కడున్న వారు రాళ్లదాడి చేయడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు తనిఖీ బృందం పరుగులు తీసింది. బయటకు చెప్పుకుంటే ఇబ్బందని మిన్నకున్నారు.ఇటీవల గంజాయి తాగుతున్న, చిల్లర విక్రయాలు సాగిస్తున్న వారిని నగరంలోని ఎక్సైజ్ స్టేషన్ 1కు తీసుకొచ్చారు. ఇందులో ఒకతను కార్యాలయంలోని కిటికీలకు తలబాదుకుంటూ బీభత్సం సృష్టించి గాయాలతో పడిపోయాడు. అతడిని అదుపులోకి తెచ్చేందుకు చిన్నపాటి పోరాటమే చేశారు. మరో కేసులో స్టేషన్‌కు తెచ్చిన ఇద్దరు నిందితులు చేతులు



కోసుకొని అధికారి ముందే భయానక వాతావరణం సృష్టించారు. ఇలాంటి చేష్టలతో ఆబ్కారీ అధికారులు, సిబ్బంది కాసింత జంకుతున్నారు.కౌన్సెలింగ్ విధానమే కొంప ముంచిందా..గంజాయి అమ్ముతూ, తాగుతూ పట్టుబడుతున్న వారు 16 నుంచి 22 ఏళ్లలోపు వారే ఉంటున్నారు. చాలా వరకు విద్యార్థులే. వీరి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వీరికి కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేస్తున్నారు. ఇప్పుడీ విధానమే నిందితులు మరింత పేట్రేగిపోయేందుకు ఊతమి చ్చిందనే వాదన ఆబ్కారీ శాఖలో ఉంది. ఇలా కౌన్సెలింగ్ ఇచ్చిన వారి సంఖ్య ఖమ్మం నగరంలోనే 600 వరకు ఉంది. ఇందులో పట్టుబడిన వారే మళ్లీ పట్టుబడుతున్నా వారిపై వస్తున్న ఒత్తిళ్లతో వదిలేస్తున్నారు.

# తెర మెరవాలి.. తరగతి మురవాలి

వరంగల్ : సైన్స్‌లోని పాఠ్యాంశం బోధిస్తూ మానవుడి శరీరంలోని వివిధ అవయవాలు, వాటి పనితీరు గురించి ఉపాధ్యాయులు వివరిస్తారు. నల్లటి బోర్డుపై బొమ్మ గీస్తారు. కానీ ఎలా పని చేస్తాయో చూపించలేరు. అదే డిజిటల్ తరగతుల్లో తెరపై ప్రత్యక్షంగా చూపిస్తే విద్యార్థులకు బాగా గుర్తుంటుంది. తెరపై కదలాడే విషయాలను విద్యార్థులు ఎక్కువగా గుర్తుంచుకుంటారు. ఎంతో ఆసక్తితో చూస్తారు. పాఠ్యాంశాలపై ధ్యాస పెడతారు. విద్యాబోధన దృశ్యరూపంలో ఉంటే మరింత ప్రయోజనం కలుగుతుందని ప్రభుత్వం డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టింది. కానీ కొన్ని అవాంతరాలు ఎదురవుతున్నాయి.. వాటిని అధిగమించి.. విద్యార్థులకు తెర కనిపించేలా తరగతి గతి మార్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

సర్కార్ బడుల్లో ప్రభుత్వం కార్పొరేట్ హంగులు కల్పిస్తోంది. 'మన ఊరు-మన బడి' పథకంలో భాగంగా ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. దృశ్యశ్రవణ బోధనకూ శ్రీకారం చుట్టింది. ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ టచ్ స్క్రీన్ టీవీల ద్వారా బోధించడానికి విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఎంపిక చేసిన పాఠశాలలకు డిజిటల్ టీవీలు వచ్చాయి. తెలంగాణ స్టేట్ టెక్నోలాజికల్ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్) సహాయంతో పనులు చేస్తున్నారు. ప్రతి స్కూల్‌కు మూడు చొప్పున 8, 9, 10, తరగతుల విద్యార్థులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) టీవీలు వచ్చాయి. వీటి ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో బోధన చేపట్టాలి. కొన్ని జరుగుతుండగా, మరికొన్ని బడుల్లో జరగడం లేదు. నెట్ లేక ఇ బ్బందులుఎంపిక చేసిన పాఠశాలల్లో ఇంటర్‌నెట్ సదుపాయం లేకపోవడంతో బోధనకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఉపాధ్యాయులే తమ చరవాణుల్లో హాట్‌స్పాట్‌ల ద్వారా వైఫై సమకూరుస్తున్నారు. నెట్ స్పీడ్‌గా లేకపోవడంతో బోధన సరిగా జరగడం లేదు.పర్యవేక్షణ అవసరంవైఫై ఏర్పాటు చేయకపోవడంతో బోధన కుంటు పడుతోంది. ప్రభుత్వమే ఇంటర్‌నెట్ ఏర్పాటు చేయించాలి. డిజిటల్ బోధన కోసం ప్రతి పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడికి శిక్షణ ఇచ్చారు. అతను రాని పక్షంలో బోధన ఎలా జరగాలనేది... ప్రశ్నార్థకంగా మారింది. కొన్ని చోట్ల మన ఊరు మనబడి పనులు



జరుగుతున్నాయి. దీంతో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయలేదు. వెంటనే పనులు పూర్తి చేయించాలి. ఈ సమస్యలకు విద్యాశాఖ అధికారులు పరిష్కారం చూపాలి. తరచూ పర్యవేక్షణ చేయాలి. ఉపాధ్యాయులు కూడా ప్రత్యేకంగా చొరవ చూపాల్సి ఉంది.

అవాంతరాలు ఇలా..దామెర(పరకాల): దామెరలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో డిజిటల్ బోధన కోసం ఎల్ఈడీ టీవీ అమర్చారు. కానీ ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇవ్వలేదు. ఉపాధ్యాయులు తమ చరవాణులను టీవీలకు అనుసంధానం చేసుకుని బోధన చేస్తున్నారు. కానీ నెట్ సరిగా రాకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.జనగామలోని జిల్లా ప్రజా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలకు మూడు డిజిటల్ బోర్డులు అందజేశారు. తరగతి గదులు సరిగా లేకపోవడంతో స్టాఫ్‌రూంలో భద్రపరిచారు. ప్రస్తుతం మన ఊరు- మన బడి పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తి అయిన వెంటనే తరగతి గదుల్లో టీవీలు అమర్చి డిజిటల్ బోధన చేస్తామని ఉపాధ్యాయు లు చెబుతున్నారు.

ప్రత్యేక శిక్షణ

ఎంపికైన పాఠశాలల్లో 75 అంగుళాల పొడవున్న మూడు డిజిటల్ మానిటర్లు, 2 కేవీ యూపీఎస్‌లు, బోధన కోసం యాప్‌లు, స్మార్ట్ క్లాస్‌రూంలో నాలుగు ట్యూబ్‌లైట్లు, రెండు ఫ్యాన్లు, గ్రీన్‌బోర్డులు ఏర్పాటు చేశారు. డిజిటల్ బోధనకు ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

మల్టీ ఫీచర్స్‌లో డిజిటల్ స్క్రీన్

మల్టీపుల్ ఫీచర్స్ డిజిటల్ స్క్రీన్ డివైజ్‌ను ఏర్పాటు చేశారు. వీటికి ఇంటర్ నెట్, వైఫై, మొబైల్ హాట్‌స్పాట్ సదుపాయం కల్పించారు. విద్యార్థులకు కావాల్సిన ఆడియో, వీడియోలు, త్రీడి ఇమేజ్‌లను గూగుల్ సెర్చ్, యూట్యూబ్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయం ఉంది. మొబైల్ నుంచి ఈ డివైజ్‌కు వీడియోలు పంపుకోవచ్చు. పెన్‌డ్రైవ్, సీడీల్లో ఉన్న పాఠాలనూ తెరపై ప్రదర్శించడానికి అనుకూలంగా ఉంటుంది.సులభంగా అర్థమవుతాయి

పిన్నింటి బాలాజీరావు, సైన్స్ ఉపాధ్యాయుడు

తెరపై బోధనతో పిల్లలకు సులభంగా అర్థమవుతుంది. వినాలనే ఆసక్తి కలుగుతుంది. ఎక్కువకాలం గుర్తుంటుంది. సందేహాలను ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవచ్చు.

త్వరలో ఇంటర్‌నెట్ సదుపాయం

బోయినపల్లి రాధ, సీఎంవోవిద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలల్లో బోర్డులు ఏర్పాటు చేశాం. ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించాం. త్వరలో పాఠశాలల్లో నెట్, వైఫై సౌకర్యం కల్పిస్తాం. ఉపాధ్యాయులు తమ చరవాణిలోని హాట్‌స్పాట్ కనెక్షన్‌తో బోధిస్తున్నారు.

## తాగునీరు కలుషితం.. అధికారుల నిర్లక్ష్యం

వరంగల్ : వర్షాకాలం వ్యాధుల సీజన్.. నీళ్లతో ముప్పు ఎక్కువ.. నగరంలో ఇప్పుడిప్పుడే డెంగీ, మలేరియా, జ్వరాల బాధితులు పెరుగుతున్నారు. ప్రజలను అప్రమత్తం చేయాల్సిన గ్రేటర్ వరంగల్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.. వరంగల్ ప్రాంతంలోని దేశాయిపేట బొడ్రాయి, ఎస్సీ కాలనీ, రంగంపేట, పాత ఏకశిలా హోటల్ వెనక గల్లీ, రామన్నపేట, ఎంజీఎం ఆసుపత్రి ఎదురుగా శ్రీనివాస కాలనీ తదితర ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా నల్లాల ద్వారా కలుషితమైన నీరు సరఫరా అవుతోంది. రంగు మారిన, దుర్వాసన తో కూడిన నీళ్లు వస్తుండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఉర్సు బొడ్రాయిలో స్మార్ట్ రోడ్ల నిర్మాణం కోసం అడ్డగోలుగా తవ్వకాలు చేయగా, మిషన్ భగీరథ నల్లా పైపులు దెబ్బ తిన్నాయి. కాజీపేట, హనుమకొండ ప్రాంతాల్లో సైతం నల్లాల ద్వారా కలుషిత నీరు వస్తున్నట్లు కాలనీల నుంచి ఫిర్యాదులున్నాయి. ఇంత జరుగుతున్నా.. బల్దియా ఇంజినీర్లు కదలడం లేదు. వర్షకాలంలో స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని స్థానిక ఏఈ, లైన్‌మెన్లకు ఫోన్లు చేసినా స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పైప్‌లైన్ లీకేజీలతోనే..: పైపులైన్ లీకేజీలతోనే కాలనీలకు కలుషితమైన నీరు సరఫరా జరుగుతున్నట్లు పరిశీలనలో తేలింది. పాతకాలం నాటి ఆర్‌సీసీ డిస్ట్రిబ్యూషన్ పైపులు దెబ్బతిన్నాయి.

# పేదల వైద్యానికి భరోసా

సంగారెడ్డి : పేదల వైద్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. పల్లె ప్రజలకు ఎలాంటి సుస్తీ చేసినా సమీపంలోని ఆరోగ్య ఉప కేంద్రాలకు పరుగులు తీస్తుంటారు. అక్కడ ప్రసవాలు, శస్త్ర చికిత్సలు మినహా సాధారణ అన్ని రకాల వైద్య సేవలు అమలు చేస్తుంటారు. అలాంటి సేవలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే జిల్లాలో 246 కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందిస్తుండగా.. తాజాగా మరో 20 ఆరోగ్య ఉప కేంద్రాలను మంజూరు చేసింది. ఒక్కో చోట కొత్త భవనం నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున రూ.4కోట్లు మంజూరు చేస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కథనం.

**భవన నిర్మాణాలకు నిధులు**

జిల్లాలోని భానూరు పీహెచ్‌సీ పరిధిలో సుల్తాన్‌పూర్, బొల్లారం(ఖాజీపల్లి), కానుకుంట(నల్లవల్లి), మునిపల్లి(బుధేరా), మక్త క్యాసారం, మల్లికార్జునపల్లి), పుల్కల్(లక్ష్మీసాగర్, మిన్‌పూర్, శివ్వంపేట), రామచంద్రాపురం(కొల్లూరు, న్యూ ఎంఐజీ కాలనీ, రామచంద్రాపురం,



తెల్లాపూర్, వెలిమెల), తాలెల్మా(రాంసాన్‌పల్లి, దేవునూర్)లో ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో చోట కొత్త భవనం నిర్మించడానికి రూ. 20లక్షల చొప్పున నిధులు కేటాయించారు. జిల్లాలో ఇప్పటికే 246 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండగా.. వాటిలోని 122 కేంద్రాలను పల్లె దవాఖానాలుగా ప్రభుత్వం మార్పు చేసింది. 75 మంది వైద్యులను భర్తీ చేసింది. ఇంకా 47 మంది వైద్యులను భర్తీ చేయాల్సి ఉంది. ఆరోగ్య ఉప కేంద్రాల్లో జ్వరం, దగ్గు, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, చిన్నారులకు టీకాల పంపిణీ, రక్త పరీక్షలు తదితర సేవలందిస్తారు. ఇక్కడ ఒక వైద్యుడితో పాటు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉంటారు.

**త్వరలో పనులు ప్రారంభిస్తాం..గాయత్రీదేవి, జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారి**

కొత్తగా మంజూరైన ఆరోగ్య ఉప కేంద్రాలకు భవనాలు నిర్మించాల్సి ఉంది. ఒక్కో చోట రూ.20 లక్షలతో పనులు చేపట్టేలా టెండర్లు పిలిచి గుత్తేదార్లతో ఒప్పందం చేసుకుంటాం. ఉప కేంద్రాల సంఖ్య పెరగడంతో పేదలకు వైద్య సేవలు మరింత చేరుక కానున్నాయి.

# కొత్త పథకం.. బడి ప్రగతి పథం

చేగుంట : సర్కారు బడుల్లో సౌకర్యాలు అంతంతమాత్రమే ఉండటంతో వాటిని బలోపేతం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు..మన బడి'కి శ్రీకారం చుట్టి వసతుల కల్పనపై దృష్టి సారించింది. ఇదే తరహాలో కేంద్రం కూడా ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పేరుతో మరో పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతి మండలంలో రెండు పాఠశాలను ఎంపిక చేయనున్నారు.

**60 రకాల ప్రశ్నావళి**

యూడైస్ ప్లస్‌లో నమోదైన సమాచారం ప్రకారం జిల్లాల వారీగా పాఠశాలలను ఎంపిక చేసేందుకు, అధికారులను గతంలో జిల్లాలకు పంపించారు. ఇందులో ఎంపికైన వాటి ప్రధానోపాధ్యాయులు 60 రకాల ప్రశ్నావళిని పూరించారు. పాఠశాల చిత్రాలు, పంచాయతీ తీర్మాన ప్రతులను నిర్ణీత విధానంలో నింపి ఆన్‌లైన్‌లో పంపించారు. సొంత భవనం, అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ, విద్యార్థుల నమోదు, శౌచాలయాలు, తాగునీరు, శుభ్రత, ఉపాధ్యాయులు, విద్యుత్తు, గ్రంథాలయ వసతి, వంటి అంశాలను ప్రస్తావిస్తూ నమూనాను పూరించి అన్‌లైన్లో నమోదు చేశారు. ప్రస్తుతం మండలానికి రెండు పాఠశాలలను ఎంపిక చేయనున్నారు.

**42 పాఠశాలలకు అవకాశం**

జిల్లాలో 21 మండలాలున్నాయి. జడ్పీ ఉన్నత 148, ప్రాథమికోన్నత 128, ప్రాథమిక 624 పాఠశాలలున్నాయి. వీటిలో కేవలం 42 పాఠశాలలకు మాత్రమే అవకాశం ఉందని సమాచారం. ఒక్కో దాని నుంచి ఒకటి చొప్పున ఎంపిక చేయనున్నారు. ప్రస్తుతం జిల్లా నుంచి



232 పాఠశాలల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. వివరాలను ఈనెల 10 వరకు అన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఎంపికైన బడులకు విడతల వారీగా ఐదేళ్లలో రూ.2 కోట్లు విడుదలవనున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

**పారదర్శకంగా ఎంపిక**

దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యాక జిల్లా స్థాయి కమిటీ ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పాఠశాలలను పరిశీలిస్తుంది. వాటిలో ఉత్తమమైన వాటిని గుర్తిస్తుంది. అనంతరం రాష్ట్ర బృందం మరోసారి పరిశీలించి ఎంపిక చేస్తుంది. ఇందులో రాజకీయ ప్రమేయం ఉండదు. ఎంపిక పూర్తి పారదర్శకంగా జరుగుతుంది. ఇక ఎంపికైన పాఠశాలల్లో పథకం అమలును అంగీకరిస్తూ పంచాయతీ తీర్మానం చేయాలి. పాఠశాల తరఫున ప్రధానోపాధ్యాయుల తీర్మానం ప్రతితో పాటు పాఠశాల చిత్రాలను అప్‌లోడ్ చేయాలి. అప్పుడే ఎంపికకు అవకాశం ఉంటుంది.

**అవకతవకలకు తావుండదు**

**రమేష్‌కుమార్, డీఈవో**

పథకంలో ప్రతిపాదించిన విధంగా పాఠశాలల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా సాగుతుంది. మొదట జిల్లా, తర్వాత రాష్ట్రం, అనంతరం కేంద్రం స్థాయిలో పరిశీలిస్తారు. ఇందులో అవకతవకలకు తావుండదు. ఎంపికైతే పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తారు. నామినేషన్ అయిన పాఠశాలలు వచ్చేనెల పది వరకు దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేసుకోవాలి.

# ముందుకొస్తున్నది కొందరే!



సంగారెడ్డి : ఆధార్ నవీకరణ తప్పనిసరిగా మారింది.. లేదంటే కార్డు ఉన్నా ఉపయోగం ఉండదు. దీనిని దృష్టిలో ఉంచుకుని 10 ఏళ్లకోసారి ఆధార్ వివరాల నవీకరణ చేసుకోవాలని యూఐడీఐ(యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ) ఆదేశాలు జారీచేసింది. జిల్లాలోని అన్ని ఆధార్ కేంద్రాల్లో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. అవగాహన లోపంతో ప్రజల నుంచి స్పందన కరవైంది. కార్డుదారులు లక్షల్లో ఉంటే ఇప్పటివరకు ఆధార్ నవీకరణ చేసుకున్నవారి సంఖ్య వెయ్యిలోపే ఉండటం గమనార్హం.

**మార్పులు, చేర్పుల నమోదు తప్పనిసరి**

బ్యాంకు ఖాతా తెరవాలన్నా.. రేషన్ సరకులు తీసుకోవాలన్నా.. వంటగ్యాస్‌కు ప్రభుత్వం ఇస్తున్న రాయితీ బ్యాంకు ఖాతాకు జమ, చరవాణికి సిమ్‌కార్డు.. ప్రభుత్వం అందిస్తున్న అన్ని రాయితీ పథకాలకూ ఆధార్ కార్డు ఉండాల్సిందే. బ్యాంకు ఖాతా, చరవాణికి ఇది అనుసంధానమై ఉండాలి. వేలిముద్రలు సరిపోవాలి. కార్డు తీసుకున్న సమయంలో బయోమెట్రిక్ యంత్రంపై నమోదయిన వేలిముద్రలకు ఆధార్ అనుసంధానమై ఉంటుంది. బయోమెట్రిక్‌పై బొటనవేలు పెట్టగానే వివరాలన్నీ తెరపై కనిపిస్తాయి. 10ఏళ్లు దాటితే ఇబ్బందులు తలెత్తుతాయి. చరవాణి నంబరు మారినా అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరి.

**సమర్పించాల్సిన పత్రాలు**

2015కు ముందు ఆధార్ కార్డు పొందిన వారు తప్పనిసరిగా నవీకరించుకోవాల్సిందే. ఆధార్ కార్డు పొందిన సమయంలో సమర్పించిన వివరాల్లో ఏమైనా మార్పులు ఉంటే తగిన గుర్తింపు కార్డులు జతచేసి మార్చుకోవాలి. పదో తరగతి ధ్రువపత్రం, ఓటరు గుర్తింపుకార్డు, పాన్‌కార్డులో ఏదైనా ఒకటి జతచేయాలి. చిన్నారులు ఆధార్ కార్డు కల్గి ఉంటే వారికి తల్లిదండ్రుల వేలిముద్రలతో జారీచేస్తారు. చిన్నారుల వయస్సు 5ఏళ్లు దాటగానే వారి వేలిముద్రలు, ఫొటోను అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంటుంది. 70ఏళ్లు దాటిన పండుటాకులకు మాత్రం ఆధార్ బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇచ్చారు.

**952 మంది మాత్రమే**

జిల్లాలో ఆధార్ కార్డులు కల్గిఉన్న వారు 10లక్షల పైమాటే. 10 సంవత్సరాల కిందట కార్డులు పొందిన వారి సంఖ్య 5లక్షల కంటే ఎక్కువే ఉంటుంది. వీరందరూ మీసేవా కేంద్రాలకు వెళ్లి తమ వివరాలు సమర్పించి కార్డులు నవీకరించుకోవాల్సి ఉంది. ఇప్పటివరకు 952 మంది మాత్రమే ముందుకువచ్చారు.

**అవగాహన కల్పిస్తున్నాం..ప్రదీప్, టీఎస్‌టీఎస్ జిల్లా మేనేజర్**

ఆధార్ అన్నింటికీ తప్పనిసరిగా మారిన నేపథ్యంలో అందరూ తమ వివరాలను నవీకరించుకోవాలి. ఇదే విషయమై ప్రచారం చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో ఆధార్ నమోదు కేంద్రాల్లో నిర్ణీత రుసుం చెల్లించి సేవల్ని పొందాలి. నవీకరణ చేసుకోకపోతే అవసరమైన సమయంలో ఇబ్బందులు తప్పవు.

# నిధుల జాప్యం.. పల్లె ప్రగతికి అవరోధం



సంగారెడ్డి : మనూరు మండలం ముగ్దుంపూర్ గ్రామ పంచాయతీ నాలుగేళ్ల కిందట కొత్తగా ఏర్పడింది. అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు. గ్రామ జనాభా 420. ప్రతి నెలా రూ.37,000 పల్లెప్రగతి ద్వారా వచ్చేవి. అందులోంచి 11,000 ట్రాక్టర్ అప్పు, పంచాయతీ కార్మికులకు రూ.8,500, విద్యుత్తు ఛార్జీ రూ.5,800, ట్రాక్టర్ డిజిల్‌కు రూ.5,000 చెల్లించాలి. మిగతా పనులకు మిగిలేది రూ.6,700 మాత్రమే. ఇప్పుడవి కూడా నాలుగు నెలలుగా విడుదల కాకపోవడంతో ఏ పని చేయలేని పరిస్థితి.

ఈ ఒక్క చోటే కాదు. గ్రామ పంచాయతీలన్నింటిలోనూ ఇదే సమస్య. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి నిధులు ఆగస్టు వరకు ప్రతి నెలా మంజూరు చేస్తూ వచ్చింది. గత సెప్టెంబరు నుంచి విడుదల నిలిచిపోయింది. ఇటీవల కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనా సర్పంచుల ప్రమేయం లేకుండానే చెల్లింపులు జరిగిపోవడం గమనార్హం. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు తప్ప మిగతా ఆదాయం అంతంతమాత్రంగా ఉన్న పంచాయతీల్లో సమస్యలకు పరిష్కారం దొరకడం లేదు.

**తప్పని ఎదురుచూపులు..**

గతంలో ప్రకటించినట్లుగానే ప్రతి నెలా గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలలుగా పట్టించుకోకపోవడంతో పాలకవర్గాలకు ఎదురుచూపులే మిగిలాయి. జనాభా ప్రాతిపదికన పల్లె ప్రగతి నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలకు నెలకు సుమారు రూ.25 కోట్లు నాలుగు నెలలకు కలిపి రూ.100 కోట్ల వరకు రావాల్సి ఉంది.

**చెక్కులు ఇస్తున్నా.. అందని నగదు**

కొన్ని గ్రామ పంచాయతీ ఖాతాల్లో నిధులు ఉన్నా లేనట్లే అన్నట్లుగా మారింది. పనులు చేసిన గుత్తేదారులకు సర్పంచులు చెక్కులు ఇస్తున్నారు. ట్రెజరీల్లో బిల్లులు పాస్ అవుతున్నాయి. ఖాతాల్లో నగదు మాత్రం జమ కాని పరిస్థితి. ఆరు నెలలుగా ఇదే తీరు.

**అప్పే దిక్కు..**

పంచాయతీలకు ప్రభుత్వం విడుదల చేసే నిధులు ముందుగా జిల్లా పంచాయతీ కార్యాలయానికి చేరేవి. అక్కడి నుంచి జిల్లా ఖజానా శాఖకు బిల్లులు పంపేవారు. జిల్లా ఖజానా కార్యాలయం నుంచి ఉప కోశాగారాలకు అక్కడి నుంచి గ్రామ పంచాయతీ ఖాతాలకు నిధులు జమచేసే పరిస్థితి ఉండేది. ఈ ప్రక్రియ పూర్తికి సమయం ఎక్కువగా పడుతోందని గుర్తించిన ప్రభుత్వం ఏడాది కిందట ఆ పద్ధతిలో మార్పులు చేశారు. పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం నుంచే గ్రామ పంచాయతీ ఖాతాలకు నిధులు సర్దుబాటు చేస్తున్నారు. ఆదాయ వనరులు లేని గ్రామ పంచాయతీలకు పల్లె ప్రగతి నిధులే దిక్కు. ట్రాక్టర్ వాయిదాలు, పారిశుద్ధ్య సిబ్బంది వేతనాలు, వీధి దీపాలు, తాగునీటి నిర్వహణకు ఈ నిధుల్ని వెచ్చిస్తున్నారు. నిధుల విడుదలలో జాప్యంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని సర్పంచులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**వెంటనే స్పందించాలి: పద్మ, సర్పంచి ముగ్దుంపూర్**

కొత్తగా పంచాయతీ ఏర్పడింది. పల్లె ప్రగతి కింద ప్రత్యేక నిధులు రావడం లేదు. జనాభా ప్రాతిపదికన వచ్చే నిధులు ట్రాక్టరు, విద్యుత్తు, కూలీలకు తదితర ఖర్చులకే సరిపోతున్నాయి. నిధులు రాకపోవడంతో గ్రామంలో అభివృద్ధి కుంటుపడుతోంది. కాలనీల్లో మురుగు కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అభివృద్ధికి ఊతం ఇవ్వాలి.

# నిర్మాణానికి ఏదీ 'దారి'!

సంగారెడ్డి : ఏళ్ల కిందట వేసిన రహదారి నిర్వహణ కొరవడి పూర్తిగా శిథిలమైపోయింది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం నిర్మాణానికి రూ.లక్షలు మంజూరు చేసింది. అయితే టెండర్ చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. రామాయంపేట పట్టణం ప్రధాన రహదారి నుంచి మండల పరిధి దామరచెరువుకు వెళ్లే రోడ్డును ఏళ్ల కిందట నిర్మించారు. ఈ గ్రామం ద్వారా కామారెడ్డి జిల్లా మల్లుపల్లి ఇతర గ్రామాలకు వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం గుంతలుపడి, కంకరతేలి అస్తవ్యస్తంగా మారింది. దీనిని బాగుచేసేందుకు మొదటి విడత రూ.90 లక్షలు, రెండో విడత రూ.36 లక్షలు మంజూరయ్యాయి. ఇది జరిగి ఏడాది కావస్తోంది.

రెండు సార్లు టెండర్లు పిలిచినా..రహదారి నిర్మాణానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ప్యాకేజీ (మిగతా గ్రామాలకు వేయాల్సిన పనులను కలిపి) విధానంలో చేయాలనే నిబంధనతోనే వారు రావడం లేదని సమాచారం. రోడ్డు అధ్వానంగా మారడంతో, రామాయంపేట నుంచి దామరచెరువు మీదుగా కామారెడ్డి జిల్లా మల్లుపల్లి, పెద్దమల్లారెడ్డితో పాటు సమీప గ్రామాలకు వెళ్లేవారు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు దృష్టి సారించి టెండర్లు పూర్తి చేసి నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**అధికారులు చొరవ తీసుకోవాలిశివకుమార్, సర్పంచి**

నిధులు మంజూరైనా టెండర్లు పూర్తికాకపోవడం, పనులు చేపట్టకపోవడంతో నిధులు ఉన్నా నిరుపయోగమే అయింది. అధికారులు చొరవచూపి పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి.

# నేర నియంత్రణ.. కార్యాచరణ!

మెదక్ : చేగుంట మండలం కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంకు నుంచి ఓ వ్యక్తి రూ.6 లక్షలు డ్రా చేసుకుని స్కూటీపై వెళ్తుండగా గాంధీ చౌరస్తా వద్ద ఆగాడు. ఇంతలోనే గుర్తుతెలియని వ్యక్తులు డిక్కీ తెరిచి డబ్బును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో అప్రమత్తమైన పోలీసులు చేగుంట, రామాయంపేట, కామారెడ్డి జిల్లా బిక్కనూర్, కామారెడ్డి పట్టణాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. చివరకు కామారెడ్డిలో ఉన్నట్టు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరాల ఛేదన, నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఒక్క కెమెరా వందమంది పోలీసులతో సమానమని పోలీస్‌శాఖ పేర్కొంది. ఈ క్రమంలో వీటి ఏర్పాటు అత్యవసరమని, ప్రతి గ్రామంలో బిగించాలనే సంకల్పంతో ఆ శాఖ కార్యాచరణ చేపట్టింది. ఇందులో అందరినీ భాగస్వామ్యం అయ్యేలా అవగాహన కల్పిస్తోంది. తద్వారా చాలా ముందుకు వస్తున్నారు. కెమెరాలను ఏర్పాటు చేస్తున్నా, అవి వినియోగంలో ఉన్నాయా? లేదా? అనేది నిరంతరం పర్యవేక్షణ చేయాలి. అప్పుడే ప్రయోజనం నెరవేరనుంది.

జిల్లాలో హత్యలు, దొంగతనాలు, రోడ్డుప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆయా కేసులలో నిందితులను త్వరితగతిన గుర్తించాలంటే ఆధారాలు అవసరం. అందుకు పోలీస్‌శాఖ సాంకేతికతపై ఆధారపడుతున్నారు. పలు సందర్భాల్లో నేరస్థుల ఆచూకీ లభించక కేసులను





మూసివేస్తున్నారు. ఏళ్ల తరబడి నుంచి వాటిని ఛేదించకపోవడంతో చాలా సంఘటనల కేసులు మూలకు చేరుతున్నాయి. శాస్త్రసాంకేతికక రంగం వేగంగా దూసుకెళ్లడంతో పోలీస్‌శాఖ సాంకేతికతపై ఆధారపడింది. దీంతో సీసీ కెమెరాల బిగింపునకు చర్యలు తీసుకుంటోంది.

**3,503 బిగింపు..**

జిల్లా ఆవిర్భావ అనంతరం పోలీస్‌శాఖ సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి సారించింది. పలు విధాలుగా ఏర్పాటు చేయిస్తోంది. నేను సైతం ద్వారా ఇప్పటి వరకు 1,725, వ్యాపారవర్గాలు, ప్రజల తోడ్పాటుతో 1,778 బిగించారు. ఇక చాలా చోట్ల దుకాణాలు, ఇళ్ల ముందు ఏర్పాటు చేస్తున్నారు. వీటిల్లో 82 కెమెరాల ద్వారా వీడియో రికార్డింగ్ నిర్వహిస్తున్నారు. వీటి ద్వారానే జిల్లాలో ఆయా పట్టణాల్లో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాహనదారులకు జరిమానాలను విధిస్తున్నారు. జిల్లాలో 2022 ఏడాదిలో 822 కెమెరాలను ఏరాటు చేయడం గమనార్హం. అల్లాదుర్గం, మనోహరాబాద్, రేగోడ్, నిజాంపేట, కొల్చారం తదితర మండలాల్లో ఇటీవల బిగించారు. అత్యధికంగా రామాయంపేట మండలం, పట్టణంలో కలిపి 480 ఏర్పాటు చేయగా, హవేలిఘనపూర్ మండలంలో 54 బిగించారు. నర్సాపూర్ మండలం, పట్టణంలో 315, మెదక్‌లో 135 మాత్రమే ఏర్పాటు చేశారు.

**గ్రామాలపై దృష్టి**

ఈ ఏడాది జిల్లాలోని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ మేరకు ఆయా ఠాణాల పరిధిలో ఉన్న అధికారులను సన్నద్ధం చేస్తున్నారు. నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉండడంతో ఆ దిశగా ప్రతి ఊరిలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛందసంస్థలు, దాతల సహకారంతో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రోహిణిప్రియదర్శిని ప్రత్యేక దృష్టి సారించారు.

# పురాతన చెరువు.. పర్యాటకానికి దరువు

హుస్నాబాద్ : హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు మినీట్యాంకు బండ్‌గా ఆధునీకరణకు పర్యాటక శాఖ చర్యలు చేపట్టింది. ఇటీవల ఆధునీకరణకు రూ.3.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. చేపట్టే పనుల గురించి పర్యాటక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దాదాపు రెండు వేల ఎకరాలకు నీరందించే ఈ చెరువు కాకతీయుల కాలం



నాటిది. ఈ ప్రాంతంలో పేరొందిన ఈ చెరువును అభివృద్ధి చేస్తే పర్యాటక కేంద్రంగా మారుతుంది. దీనికి సమీపంలో పురాతన కాలం నాటి రేణుకా ఎల్లమ్మ దేవాలయం ఉంది. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి దర్శించుకుంటారు. చెరువుకట్టను ఆనుకుని ఉన్న ఏనెపై సిద్దేశ్వరాలయం, అయ్యప్పస్వామి, సంతోషిమాత, దక్షిణముఖ ఆంజనేయ గుళ్లు ఉన్నాయి. వీటితో పాటు ఇక్కడ ఒక దర్గా ఉంది. సమీపంలో శివ మార్కండేయ, సీతారామచంద్రస్వామి, పెద్దమ్మతల్లి, మడేలయ్య దేవాలయాలు ఉన్నాయి. కొద్దిరోజులుగా అసంపూర్తి నిర్మాణంలో ఉన్న మినీట్యాంకుబండ్‌ను పూర్తి చేయించడానికి మంత్రి హరీశ్‌రావు నిధులు మంజూరు చేశారు. పనుల నిర్వహణ బాధ్యతను పర్యాటక శాఖకు అప్పగించారు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి ఆ శాఖ అధికారులు రెండు సార్లు ఇక్కడకు వచ్చి చేపట్టాల్సిన పనులపై చర్చించారు. చెరువు కట్టపై నడక దారి, సైక్లింగ్ మార్గం, ఎల్‌ఈడీ దీపాలు, ఆహారశాల, వాహనాల పార్కింగ్ సదుపాయం, హరితహారంతో ఆహ్లాదకరమైన పరిసరాలు, బోటింగ్, బతుకమ్మ నిమజ్జనానికి ఘాట్, బయోశౌచాలయాలు తదితరాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. నిధులు మంజూరు కావడంతో ప్రతిపాదించిన పనులకు టెండరు ప్రక్రియ త్వరలో జరుగుతుందని పురపాలిక అధ్యక్షురాలు ఆకుల రజిత తెలిపారు.

# సీనియర్ జర్నలిస్ట్ శ్రీరమణ మృతికి సీఎం వైయస్ జగన్ సంతాపం



తాడేపల్లి: ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ శ్రీరమణ మృతి పట్ల ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీరమణ రాసిన మిథునం కథ సినిమాగా రూపొందుకొని పెద్ద విజయం సాధించిందని, అలాగే ఆయన రాసిన చిన్న కథలు మానవత్వం, విలువలతో కూడిన స్పర్శను కలిగి ఉంటాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేసుకున్నారు.
శ్రీరమణ మృతికి సీఎం సంతాపం తెలిపారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# కొత్తగా ఆ నలుగురికి డీసీసీబీ ఛైర్మన్ గిరి.. జగన్ లెక్కలు అదుర్స్



అమరావతి : అధికారంతో పాటు అసంతృప్తి మామూలే. అధికారం చేతి లో ఉన్నప్పుడు ఉన్నా కాసిన్ని పదవుల కోసం పోటీ పడే వారు పెద్ద సంఖ్యలో ఉంటారు. అందరికి సమాన అవకాశాలు ఇస్తూ.. ఎవరిని చిన్నబుచ్చకుండా చేయటం అంత తేలికైన విషయం కాదు. తనకు లభించే ఏ చిన్న అవకాశాన్ని వదలకుండా అందరిని అసంతృప్తి పరిచే తీరు తనకు ఉందన్న సంకేతాల్ని అధినేత ఇవ్వటం అత్యంత కీలకం. ఈ విషయాన్ని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. తాజాగా తీసుకున్న నిర్ణయాన్ని చూసినప్పుడు.. ఆయన అనుసరించిన ఫార్ములాను చూస్తే.. ఈ విషయం పై మరింత క్లారిటీ ఖాయం. రాష్ట్రం లోని 13 డీసీసీబీల ఇన్ ఛార్జి కమిటీల పదవీ కాలం మంగళవారం ముగిసింది. అందులోని తొమ్మిదింటిని కంటిన్యూ చేస్తూ నిర్ణయాన్ని తీసుకున్న సీఎం జగన్.. మరో నాలుగింటికి విషయం లో మాత్రం భిన్నమైన నిర్ణయం తీసుకున్నారు. దీనికి కారణం సమీకరణాల్లో చిక్కులు ఉండటమేనని చెబుతున్నారు. నలుగురికి పదవులు లభించేలా తీసుకున్న ఆయన నిర్ణయం ఆసక్తికరంగా మారింది. కొత్తగా నియమించిన వారి పదవీ కాలం ఆర్నెల్లు మాత్రమే ఉన్నప్పటికీ.. తనకు ఏ మాత్రం ఛాన్సు లభించినా.. అందరిని సంతృప్తి పరిచేందుకు తాను ప్రయత్నిస్తున్నానన్న సంకేతాల్ని ఇచ్చినట్లుగా చెప్పాలి. విశాఖపట్నం లోని డీసీసీబీ ఛైర్ పర్సన్ గా ఉన్న చింతకాయల సన్యాసిపాత్రుడి భార్య అనిత స్థానం లో కోలా గురువుల కు ఛాన్సు ఇచ్చారు. ఇటీవల ఎమ్మెల్యేల కోటా లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిన ఆయన్ను వదిలేయకుండా.. తనను నమ్ముకున్న అతనికి తాజా పదవి తో ఊరట ను ఇచ్చారు. నర్సీపట్నం సిట్టింగ్ ఎమ్మెల్యే సన్యాసిపాత్రుడికి గురువులుకి మధ్య సంబంధాలు సరిగా లేని వేళ.. సిట్టింగ్ ఎమ్మెల్యే భార్యకు పదవీ కాలం ముగిసిన వెంటనే ఆమెను తప్పించి.. గురువుల కు పదవి ని అప్పజెప్పటం ద్వారా.. సమతూకాన్ని పాటించినట్లుగా మారిందంటున్నారు. ప్రకాశం జిల్లా డీసీసీబీ ఛైర్మన్ పదవిని మారుతిప్రసాద్ రెడ్డికి ఇచ్చారు. ఇతను మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి అత్యంత సన్నిహితుడు. ఇటీవల కాలం లో చోటు చేసుకున్న పరిణామాల్లో బాలినేని తీవ్ర అసంతృప్తితో ఉన్న సంగతి తెలిసిందే. కనిగిరి ఎమ్మెల్యే మధుసూదన్ యాదవ్ కు వ్యతిరేక వర్గంగా ఉన్న మారుతిప్రసాద్ బాలినేనికి అత్యంత ఆప్తుడు. ప్రస్తుతం పదవీ కాలం పూర్తైన మాదాసి వెంకయ్య కొండపి రేసు లో ఉన్నారు. ఈ సమయం లో బాలినేని సన్నిహితుడికి పదవిని కేటాయించటం ద్వారా.. అసంతృప్తి లెక్కలు సరి చేశారన్న మాట వినిపిస్తోంది.

కర్నూలు డీసీసీబీ ఛైర్ పర్సన్ పదవిని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి సతీమణి విజయ మనోహరికి ఇచ్చారు. కర్నూలు టికెట్ పై మోహన్ రెడ్డికి.. స్థానిక ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ కు మధ్య పోటీ నెలకొన్న వేళ.. సర్దుబాటు లో భాగంగా ఎస్వీ మోహన్ రెడ్డి సతీమణికి పదవిని ఇచ్చినట్లుగా చెబుతున్నారు. మరో పదవి (క్రిష్ణా డీసీసీబీ ఛైర్మన్)ని తన్నీరు నాగేశ్వరరావు స్థానంలో తాతినేని పద్మావతిని నియమిస్తూ నిర్ణయం తీసుకన్నారు. 2019 ఎన్నికల్లో చిలకలూరి పేట నియోజకవర్గంలో పార్టీ కోసం పని చేసిన ఆమెకు తాజా నిర్ణయంతో గుర్తింపు లభించినట్లైంది.




బెంగళూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయేపై ఉమ్మడి పోరుకు జట్టు కట్టిన విపక్షాలు.. తమ కూటమికి ఇండియాగా నామకరణం చేశాయి. ఈ పేరును కూటమిలోని అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో సమ్మతించాయని విపక్ష నేతలు తెలిపారు. అయితే, బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ మాత్రం ఈ పేరును తీవ్రంగా వ్యతిరేకించినట్లు విశ్వసనీయ వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఇతర పార్టీల నేతలు సర్దిచెప్పడంతో చివరకు ఆయన అంగీకరించినట్లు పేర్కొన్నాయి. ప్రతిపక్షాల కూటమి పేరు గురించి కాంగ్రెస్ ముందుగా ఎలాంటి చర్చలు జరపలేదట. విపక్ష నేతల భేటీ సమయంలో ఉన్నట్టుండి 'ఇండియా' అనే పేరును హస్తం పార్టీ నేతలు ప్రతిపాదించారని సదరు వర్గాలు తెలిపాయి. ఆ పేరు వినగానే నీతీశ్ కుమార్ షాక్ అయ్యారని పేర్కొన్నాయి. "ప్రతిపక్షాల కూటమికి INDIA అనే పేరు ఎలా పెడతారు? పైగా ఇందులో భాజపాకు చెందిన NDA కూటమి అక్షరాలున్నాయి?" అని బిహార్ సీఎం ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కొందరు లెఫ్ట్ పార్టీ నేతలు కూడా ఈ పేరుపై సంకోచించి.. ప్రత్యామ్నాయ పేర్లను సూచించినట్లు సమాచారం. అయితే, అత్యధిక పార్టీలు ఈ పేరును ఆమోదించడంతో నీతీశ్ కూడా అంగీకరించక తప్పలేదని సదరు వర్గాలు తెలిపాయి. "ఓకే.. మీ అందరికీ INDIA పేరు నచ్చినట్లయితే.. నాకూ ఓకేనే" అని నీతీశ్ అన్నారట..!

**విపక్ష కూటమి ఇండియా** విపక్షాల కూటమికి 'ఇండియా' పేరును కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సూచించారని కొందరు నేతలు వెల్లడించారు. అయితే తొలుత ఇందులోని డి అనే అక్షరానికి డెమోక్రటిక్ (ప్రజాతంత్ర) అని ప్రతిపాదించారు. ఎన్డీయేలో డి అక్షరానికి అదే అర్థం ఉన్నందువల్ల దీనిని డెవలప్‌మెంటల్‌గా మారుద్దామని కొందరు నేతలు సవరించారు. నేషనల్ అనే పదాన్ని తీసేద్దామని కూడా ఒక దశలో అనుకున్నా చివరకు దానిని ఉంచాలనే నిర్ణయించారు. అలా చివరకు విపక్షాల కూటమికి 'ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్ (ఐఎన్‌డీఐఏ– ఇండియా)' పేరును ఖరారు చేశారు.

**ట్యాగ్‌లైన్.. జీతేగా భారత్ :** విపక్షాల కూటమికి నిన్న పేరును ఖరారు చేయగా.. నేడు ట్యాగ్‌లైన్ ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో భాజపాను ఓడించడమే లక్ష్యంగా 'జీతేగా భారత్ (ఇండియా విల్ విన్)' అనే ట్యాగ్‌లైన్‌ను పెట్టాలని నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మంగళవారం అర్ధరాత్రి దాకా సాగిన సమావేశాల్లో దీన్ని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. కూటమి పేరు 'ఇండియా' కింద పలు ప్రాంతీయ భాషల్లో ఈ ట్యాగ్‌లైన్ కన్పించనుంది.

# నిర్మాత అరవింద్ పరువునష్టం కేసు, జీవిత రాజశేఖర్ లకు జైలు శిక్ష



పరువు నష్టం కేసులో, ప్రముఖ టాలీవుడ్ దంపతులు జీవిత ఆమె భర్త రాజశేఖర్‌లకు నాంపల్లి లోని, 17వ అదనపు చీఫ్ మెట్రో పోలిటన్ మేజిస్ట్రేట్ (ఏసిఎంఎం) ఒక ఏడాది జైలు శిక్ష, అయిదు వేల రూపాయలు జరిమానా విధించింది. చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌పై గతంలో రాజశేఖర్ దంపతులు తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఫ్రీ గా రక్తం తెచ్చుకుంటూ, మార్కెట్ లో అమ్ముకుంటున్నారని అప్పట్లో రాజశేఖర్ దంపతులు చిరంజీవి బ్లడ్ బ్యాంక్ మీద వ్యాఖ్యలు చేశారు. ఇవన్నీ జరిగింది 2011 సంవత్సరం లో. ఇటువంటి ఆరోపణలు చెయ్యగానే అప్పట్లో వెంటనే ప్రముఖ నిర్మాత, చిరంజీవి బావమరిది అయిన అల్లు అరవింద్ వెంటనే వీరిద్దరిపై పరువునష్టం దావా వెయ్యటం జరిగింది. చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న మంచి పనుల మీద వీరిద్దరూ చేసిన ఆరోపణలు అవాస్తవమని అప్పట్లో అల్లు అరవింద్ కోర్టులో పరువు నష్టం దావా వేయటం జరిగింది. అప్పటి నుండి ఆ కేసు సాగుతూ నిన్నటికి నాంపల్లి కోర్టు ఈ సంచలన తీర్పు ఇచ్చింది. వీరిద్దరికీ ఏడాది పాటు జైలు శిక్ష, 5,000 రూపాయలు జరిమానా విధించటం అని తీరుపై ఇచ్చారు. ఈ దంపతులు వెంటనే జరిమానా చెల్లించటంతో వీరికి జిల్లా కోర్టులో వెంటనే బెయిల్ మంజూరు అయినట్టుగా తెలిసింది. అలాగే వీరు పై కోర్టుకు వెళ్లి అప్పీలు చేసుకోవచ్చని కూడా చెప్పింది.

# పోలవరంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది: అంబటి రాంబాబు

పోలవరం: భారీ వర్షాల నేపథ్యంలో మంత్రి అంబటి రాంబాబు పోలవరం ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలవరం నిర్మాణ పనులపై మంత్రి అంబటి ఆరా తీశారు. డయాఫ్రమ్ వాల్, కాఫర్ డ్యామ్ దగ్గర వరదపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రొటోకాల్‌కు విరుద్ధంగా పనులు చేపట్టింది. గత ప్రభుత్వం పోలవరం పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయింది? అని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం తప్పిదాల వల్లే ప్రాజెక్ట్ ఆలస్యమైంది. పోలవరం ప్రాజెక్ట్‌పై మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. మా ప్రభుత్వంపై ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోంది అని సీరియస్ అయ్యారు.



# ఇది బడుగు, బలహీనవర్గాల, మైనార్టీల ప్రభుత్వం

## ముస్లిం ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, ఆ వర్గాలకు చెందిన ప్రతినిధులతో సీఎం వైయస్ జగన్ సమావేశం

## ఉమ్మడి పౌరస్మృతి అంశంపై తమ అభిప్రాయాలను ముఖ్యమంత్రితో పంచుకున్న ముస్లిం ప్రజాప్రతినిధులు, మత పెద్దలు



తాడేపల్లి: ఈ ప్రభుత్వం మీ ప్రభుత్వం... బడుగు, బలహీనవర్గాల, మైనార్టీల ప్రభుత్వమని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మీరు ఎలాంటి ఆందోళనకు, భయాలకు గురికావాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. మీ మనసు నొప్పించేలా ఎప్పుడూ కూడా ఈ ప్రభుత్వం వ్యవహరించదని సీఎం వైయస్ జగన్ హామీ ఇచ్చారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ముస్లిం ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, ఆ వర్గాలకు చెందిన ప్రతినిధులతో ముఖ్యమంత్రి వైయస్.జగన్ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి పౌరస్మృతి అంశంపై తమ అభిప్రాయాలను ముస్లిం ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, ఆ వర్గాలకు చెందిన ప్రతినిధులు ముఖ్యమంత్రితో పంచుకున్నారు.

**ఈ సందర్భంగా సీఎం ఏమన్నారంటే** – ఈ ప్రభుత్వం మీ ప్రభుత్వం. బడుగు, బలహీనవర్గాల, మైనార్టీల ప్రభుత్వం – మీరు ఎలాంటి ఆందోళనకు, భయాలకు గురికావాల్సిన అవసరం లేదు:
– మీ మనసు నొప్పించేలా ఎప్పుడూ కూడా ఈ ప్రభుత్వం వ్యవహరించదు: – ఉమ్మడి పౌరస్మృతి అంశంమీద డ్రాఫ్ట్ అనేది ఇప్పటివరకూ రాలేదు. అందులో ఏ అంశాలు ఉన్నాయో కూడా ఎవ్వరికీ తెలియదు. కాని మీడియాలో, పలుచోట్ల చర్చ విపరీతంగా నడుస్తోంది. – వాటిని చూసి ముస్లింలు పెద్దస్థాయిలో తమ మనోభావాలను వ్యక్తంచేస్తున్నారు. – కొన్ని అంశాలను మీ అందరి దృష్టికి తీసుకు వస్తున్నాను: సీఎం – ఒక రాష్ట్రానికి పాలకుడిగా, ముఖ్యమంత్రి స్థాయిలో నేను ఉన్నాను. – ఇలాంటి పరిస్థితుల్లో మీరు ఉంటే గనుక ఏం చేసేవారన్నదానిపై మీరు ఆలోచనలు చేసి నాకు సలహాలు ఇవ్వండి. – ఇక్కడ ఇంకో విషయాన్నికూడా మీ దృష్టికి తీసుకు వస్తున్నాను. – ముస్లిం ఆడబిడ్డల హక్కుల రక్షణ విషయంలో ముస్లింలే వ్యతిరేకంగా ఉన్నారంటూ పెద్ద ప్రొపగండా నడుస్తోంది. ఇలాంటి దాన్ని మత పెద్దలుగా మీరు తిప్పికొట్టాలి. – ఒకే కడుపున పుట్టిన బిడ్డల విషయంలో ఏతండ్రైనా, ఏతల్లి అయినా ఎందుకు భేదభావాలు చూపుతారు? – మహిళలకు సమాన హక్కుల విషయంలో ఏ మాత్రం రాజీలేదనే విషయాన్ని మన అంతా స్పష్టం చేద్దాం. – భారతదేశం చాలా విభిన్నమైనది. ఈ దేశంలో అనేక మతాలు, అనేక కులాలు, అనేక వర్గాలు ఉన్నాయి. ఒకే మతంలో ఉన్న వివిధ కులాలు, వర్గాలకూ వివిధ రకాల సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఉన్నాయి. వారివారి మత గ్రంధాలు, విశ్వాసాలు, ఆచరించే సంప్రదాయాల ఆధారంగా వారికి వారి పర్సనల్ లాబోర్డులు ఉన్నాయి. ఏ నియమమైనా ఏ నిబంధన అయినా సాఫీగా తీసుకురావాలనుకున్నప్పుడు నేరుగా ప్రభుత్వాలు కాకుండా ఆయా మతాలకు చెందిన సంస్థలు, పర్సనల్ లాబోర్డుల ద్వారానే చేయాలి. ఎందుకంటే వాటిమీద పూర్తి అవగాహన వారికే ఉంటుంది కాబట్టి. %వీఅంఅత్‌వతీజూతీమ్ఖ్‌అశీఅ%కు తావు ఇవ్వకుండా ఉంటుంది కాబట్టి. ఒకవేళ మార్పులు అవసరం అనుకుంటే, ఈ విషయంలో సుప్రీంకోర్టు, లా కమిషన్, కేంద్ర ప్రభుత్వం కూడా అందరూ కలిసి, వివిధ మతాలకు చెందిన సంస్థలను, వారి పర్సనల్ లాబోర్డ్స్‌తో మమేకమై, వారి పర్సనల్ లా బోర్డ్స్ ద్వారా ఒకవేళ మార్పులు అవసరమైతే జరగాలి తప్ప వేరే పద్ధతిలో జరిగితే, అది ఇంత భిన్నత్వం ఉన్న మన దేశంలో తగదు.

# జగన్.. నమ్మి భూములిస్తే రైతులను రోడ్డున పడేస్తారా?: అమరావతి ఐకాస




విజయవాడ: అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించకుండా ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని అమరావతి రాజధాని ఐకాస నేతలు ఆరోపించారు. డాక్యుమెంట్లు చూపాలని రైతులను వేధిస్తారా? అని ప్రశ్నించారు. రాజధాని అసైన్డ్ రైతుల వార్షిక కౌలు నిలుపుదలను నిరసిస్తూ విజయవాడలోని గాంధీనగర్ ధర్నాచౌక్ వద్ద రైతులు, ఐకాస నేతలు మహాధర్నా చేపట్టారు. సాయంత్రం 4గంటల వరకు ఈ నిరసన కొనసాగించనున్నట్లు తెలిపారు. "వేరే ప్రాంతం వారికి ఇక్కడ ఇళ్లు అంటున్నారు.. భూములిచ్చిన రైతుల పరిస్థితేంటి? పత్రాల సాకుతో వార్షిక కౌలు నిలుపుదల చేశారు. మేం కోర్టుకు వెళ్తే వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుందని గ్రహించాలి. వార్షిక కౌలు కూడా చెల్లించని ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెబుతారు" అని రాజధాని రైతులు హెచ్చరించారు. "పేదల సీఎం అని జగన్ చెబుతున్నారు..

కానీ వారికే న్యాయం చేయట్లేదు. సీఎంకు.. రాజధానిలోని ఎస్సీలు పేదవాళ్లుగా కనబడట్లేదా? నమ్మి భూములిస్తే.. అమరావతి రైతులను రోడ్డున పడేస్తారా? ఎస్సీలపై జగన్‌కు ఎందుకింత కక్ష?" అని ఐకాస నేతలు ప్రశ్నించారు.



# మురళీధరన్‌తో పవన్ భేటీ.. 15 నిమిషాల పాటు సాగిన చర్చ

ఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ బీజేపీ వ్యవహారాల ఇన్చార్జ్ మురళీధరన్‌తో పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. ఈ భేటీలో ఆయనతో పాటు నాదేండ్ల మనోహర్ కూడా ఉన్నారు. మురళీధరన్‌తో కలిసి అల్పాహార సమావేశం నిర్వహించారు. 15 నిమిషాల పాటు వీరిద్దరి మధ్య రాజకీయాలపై చర్చ జరిగింది. నేడు పవన్ మరికొందరు బీజేపీ పెద్దలను కలిసే అవకాశం ఉంది. కాగా.. నిన్న పవన్ ఢిల్లీలో కొన్ని సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేసే అవకాశం ఉందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలిపారు. మంగళవారం ఢిల్లీలో జాతీయ మీడియాతో జనసేనాని మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వాన్ని సాగనంపడానికి అందరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. కూటమిలో ముఖ్యమంత్రి ఎవరన్నది ఎన్నికల ఫలితాల్లో బలాబలాలను బట్టి నిర్ణయం ఉంటుందన్నారు. తనకు ముఖ్యమంత్రి పదవి ముఖ్యం కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో విచ్చల విడిగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. ఉద్యోగాలు లేవని.. 1న జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. డేటా చోర్యం జరుగుతోందని తెలిపారు. రోజుకి రూ.160 జీతం ఇచ్చి పెట్టుకున్న ప్రైవేటు వ్యక్తుల ద్వారా ప్రజల డేటా అంతా చోర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఆధార్, వేలిముద్రలు, ఐరిష్ డేటా అంతా తెలంగాణలో నిక్షిప్తం చేస్తున్నారన్నారు. ప్రజా వ్యతిరేకతను ఎదురించే వారు కావాలని ఏపీ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. అందుకే జనసేనకు ఏపీలో ప్రజల నుంచి మద్దతు వస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజలు తీవ్ర నిరాశ నిస్పృహతో ఉన్నారన్నారు. మీడియాలో కనిపిస్తున్న దానికి వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని చెప్పారు. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించే పరిస్థితి లేదన్నారు. తనకు అనుకూలంగా ఉన్న వారికి మాత్రం పది శాతం వడ్డీతో రుణాలు తీసుకొచ్చి రాష్ట్ర సొమ్మును ధారాదత్తం చేస్తున్నారని పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## చీకటి గదిలో టైట్ అందాలతో చితగ్గొట్టిన ముద్దుగుమ్మ

చీకటి గదిలో చితక్కొట్టుడు సినిమా పెద్దగా ఆడకపోయినా కూడా సినిమాకు మంచి పబ్లిసిటీ దక్కింది. ఆ సినిమాలో హీరోయిన్ గా నటించిన ముద్దుగుమ్మ నిక్కీ తంబోలీకి కూడా మంచి పేరు వచ్చింది. ఆ సినిమాలో అందాల ఆరబోత విషయంలో మరో లెవల్ అన్నట్లుగా నిక్కీ తన అందంతో ఆకట్టుకున్న విషయం తెల్సిందే. హీరోయిన్ గా నిక్కీ ఆ తర్వాత వరుసగా సినిమాలు చేస్తుందని అంతా భావించారు. కానీ ముద్దుగుమ్మ ఆశించిన స్థాయిలో ఆఫర్లు దక్కించుకోలేక పోయింది. కాంచన 3 మరియు తిప్పర మీసం సినిమాల్లో నటించిన ఈ అమ్మడికి బిగ్ బాస్ లో వరుసగా రెండు



సార్లు ఈ అమ్మడు ఛాన్స్ దక్కించుకుని హిందీ ప్రేక్షకుల్లో మంచి ఆధరణ సొంతం చేసుకుంది. బుల్లితెర.. వెండి తెర మరియు ఓటీటీ ఇలా ఎక్కడ ఛాన్స్ వస్తే అక్కడ సందడి చేస్తూ ఉన్న నిక్కీ తంబోలీ మరో వైపు సోషల్ మీడియాలో షేర్ చేసే అందాలు ఆమె అభిమానులకు మతి పోగొడుతున్నాయి. ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత విషయంలో మరోసారి హద్దులు ఉండవని ఈ ఫొటోలతో అర్థం అవుతుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫొటోల్లో టైట్ టాప్ లో తన ఎద సౌందర్యంను చూపిస్తూ కవ్విస్తూ ఉంది. ఒక చేయి పైకి లేపి మరీ హొయలు పోతూ చెమటలు పట్టిస్తోంది. ఇలాంటి ఫోజ్ లు ఇస్తే చూసి తట్టుకోవడం ఎలా అమ్మడు అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. నిక్కీ అందాల విందు ముందు ముందు మరింత రంజుగా ఉండే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

## రెమ్యునరేషన్ ఏడు వందలే.. బేబీ హీరోయిన్

బేబీ తో బిగ్ హిట్ అందుకున్న వైష్ణవి చైతన్య ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారిపోయింది. మొదట టిక్ టాక్ అలాగే యూట్యూబ్ షాట్స్ ద్వారా మంచి క్రేజ్ అందుకున్న ఆమె ఆ తర్వాత సాఫ్ట్ వేర్ డెవలపర్ అనే ఒక వెబ్ సిరీస్ ద్వారా ఊహించని స్థాయిలో క్రేజ్ పెంచుకుంది. అందులో ఆమె హోమ్లీ లుక్కుతో కనిపించడంతో ఓ వర్గం కుర్రాళ్ళు అయితే ఫ్యాన్స్ అయిపోయారు. ఇక ఆమె సోషల్ మీడియాలో ఎలాంటి ఫోటోలు పోస్ట్ చేసినా కూడా బాగా వైరల్ అయ్యాయి. ఇక అల్లు అర్జున్ త్రివిక్రమ్ కాంబినేషన్లో వచ్చిన అల..వైకుంఠపురములో సినిమాలో అమ్మడు హీరోకు చెల్లెలి పాత్రలో కనిపించింది. కానీ అదేమీ అంత ప్రాధాన్యత ఉన్న పాత్ర కాకపోయినప్పటికీ అమ్మడికి మంచి క్రేజ్ అయితే వచ్చింది. ఇక హీరోయిన్ గా కెరియర్ స్టార్ట్ చేయాలని అనుకున్నప్పుడు ఆమెకు బేబీ సినిమా కంటే ముందుగానే చాలా అవకాశాలు వచ్చాయి. కానీ



మంచి కంటెంట్ ఉన్న సినిమాలే చేయాలి అని వైష్ణవి చాలా జాగ్రత్తగా పడింది. ఇక మొత్తానికి సాయి రాజేష్ దర్శకత్వంలో చేసిన బేబీ సినిమా మాత్రం బ్యూటీకి ఊహించని స్థాయిలో క్రేజ్ తెచ్చిపెట్టింది. ఈ రేంజ్ లో సినిమా సక్సెస్ అవుతుంది అని ఎవరు ఊహించలేదు. ఇక ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో అమ్మడు తన తొలి పారితోషకం గురించి కూడా చెప్పింది. టిక్ టాక్ ద్వారా అలాగే యూట్యూబ్ షాట్స్ ద్వారా కొంత క్రేజ్ వచ్చినప్పుడు కొన్ని ఈవెంట్స్ లలో కూడా డాన్స్ చేసే అవకాశాలు వచ్చాయట. అయితే నాకు మొట్టమొదట మాత్రం ఈవెంట్లో డాన్స్ చేయాలని అనుకున్నప్పుడు కేవలం 700 రూపాయల పారితోషకం మాత్రమే దక్కింది. ఇప్పుడు నాకు ఎంత వస్తున్నా కూడా ఆ మొదటి పారితోషకాన్ని మాత్రం నేను ఎప్పటికీ మర్చిపోలేను. బేబీ సినిమాలో కొన్ని బోల్డ్ సీన్స్ సీన్స్ లో అయితే కథకు సెట్ అవుతాయని మాత్రమే చేశాను. ఇక లిప్ లాక్ సీన్స్ చేసినప్పుడు నా ఫ్యామిలీ మెంబర్స్ పెద్దగా ఏమీ ఫీల్ కాలేదు. కథకు తగ్గట్టుగా ఆడియన్స్ ఎలాగైతే ఫీలయ్యారో నా కుటుంబ సభ్యులు కూడా అదే తరహాలో రియాక్ట్ అయ్యారు అని వైష్ణవి చైతన్య వివరణ ఇచ్చింది. ఇక వీలైనంత వరకు మంచి కంటెంట్ ఉన్న కథలు మాత్రమే చేస్తాను అని చేసేది తక్కువ సినిమాలు అయినా ఎప్పటికీ గుర్తిండి పోయేలా చేయాలనే భావనతో ఉన్నట్లు వివరణ ఇచ్చింది.




# స్టార్ డాటర్స్ తో మాయలోడు?



ఇటీవల ఏ పార్టీకి వెళ్లినా అతడే సెంటరాఫ్ అట్రాక్షన్. అతడు కేవలం స్టార్ డాటర్స్ తో మాత్రమే పార్టీల్లో కనిపిస్తున్నాడు. చుక్కల్లో చంద్రుడిలా వెలిగిపోతూ ఇతరులు కుళ్లుకునేలా చేస్తున్నాడు. ఇంతకీ అతడు ఎవరు? డెబ్యూ నాయికలకు మెంటారా? అంటే కానే కాదు. అతడు జస్ట్ ఫ్రెండ్ మాత్రమే. కానీ అతడికి అప్ కమింగ్ కథానాయికల్లో ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. అతడి సాన్నిహిత్యంలో ఈ ప్రపంచాన్నే మైమరిచి కాక్ టైల్ పార్టీలను ఒక రేంజులో ఆస్వాధిస్తున్నారు. రేతిరంతా జాగారంలో ఫుల్ గా చిలౌట్ చేస్తున్నారు. ఇంతగా మైమరిపింపజేస్తున్న ఈ మాయలోడు ఇంతకీ ఎవరు? అంటే వివరాల్లోకి వెళ్లాలి. చాలా కాలంగా బాలీవుడ్ నటవారసురాళ్లతో పార్టీల్లో చెలరేగుతూ రొమాంటిక్ విన్యాసాలతో నెటిజనుల కళ్లను తనవైపు తిప్పేసుకుంటున్న ఈ కుర్రాడు ఒర్రీ అలియాస్ అవ్రతమణి. సెలబ్రిటీ ప్రపంచంలో కుర్ర డీన్ లా అతడు మెరుపులు మెరిపించే వైనం చాలా కన్ఫ్యూజన్ కి గురి చేస్తోంది. ఒర్రీ కేవలం స్నేహితుడు మాత్రమేనా? సదరు భామలకు రక్షకుడా? అంటే దీనికి సరైన సమాచారం లేదు. ప్రస్తుతానికి అతడు జస్ట్ ఫ్రెండ్ మాత్రమే. ఒర్రీ ఇటీవల ఎక్కువగా అజయ్ దేవగన్- కాజోల్ కుమార్తె నైసా దేవగన్ తో ఎక్కువగా పార్టీల్లో తలమునకలుగా కనిపిస్తున్నాడు. నైసా ఇంకా సినిమాల్లోకి అడుగుపెట్టకపోయినా ఇప్పుడు అతడితో షికార్ల వల్ల బోలెడంత ఫేమస్ అయిపోతోంది. నైట్ పార్టీల్లో మతి చెడగొట్టే రూపంతో కనిపిస్తోంది. నైసాలో గ్లామర్ డోసు మరీ అంతకంతకు పెరిగిపోతోందని తాజాగా కొత్త సంవత్సర వేడుకల నుంచి విడుదలైన ఫోటోలే చెబుతున్నాయి. నైసా దేవగన్ ఓర్హాన్ అవత్రామణి సహా తన స్నేహితులతో కలిసి తన కొత్త సంవత్సరం వేడుకలను దుబాయ్ లో ఆస్వాధించిందని ఇంతకుముందే తుపాకి వెల్లడించింది. ఓర్హాన్ తాజాగా మరికొన్ని స్పైసీ ఫోటోలను ఇన్ స్టాలో పోస్ట్ చేయగా అవి వైరల్ గా మారాయి. నైసా దేవగన్ అతడితో ఎంతో సన్నిహితంగా కనిపిస్తోంది. ఒర్రీని తన అంగ రక్షకుడి(సెక్యూరిటీ)గా భావిస్తోందని ఈ ఫోటోలు చెబుతున్నాయి. ఎంతయినా క్లాస్ మేట్ కం బెంచ్ మేట్ అయితేనే కదా ఇంతటి సాన్నిహిత్యం అన్న సందేహాల్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు నైసా గ్లామర్ విందు చూశాక.. అభిమానులు నైసుగుందమ్మా ఈ యవ్వారం! అంటూ కామెంట్లు చేస్తున్నారు. అనన్య-సుహానా- ఖుషీ-జాన్వీ-సారా- మహికా రాంపాల్ సహా పలువురు బాలీవుడ్ నాయికలు అతడితో ఎక్కువగా పార్టీల్లో కనిపిస్తున్నారు. ఒకవేళ పార్టీలో అతడు మిస్సయితే ఐ మిస్ యు ఒర్రీ.. లవ్ యు! అంటూ టీజ్ చేస్తున్నారు. ఇది దేశవ్యాప్తంగా సదరు భామలకు ఉన్న సోషల్ మీడియా అనుచరుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది.

# స్లమ్ డాగ్ హస్బెండ్ వచ్చేస్తున్నాడు.. ఎప్పుడంటే..




నటుడు బ్రహ్మాజీ తనయుడు సంజయ్ రావు హీరోగా ప్రణవి మానుకొండ హీరోయిన్గా నటిస్తోన్న చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. చిన్న సినిమాగా మొదలైన ఈ చిత్రాన్ని రిలయన్స్ ఎంటర్టైన్మెంట్ వంటి పెద్ద సంస్థ రిలీజ్ చేయబోతోంది. మైక్ మూవీస్ బ్యానర్ నిర్మిస్తోన్న ఈ చిత్రం ఇటీవల టీజర్ ట్రైలర్ విడుదల చేయగా విపరీతంగా ఆకట్టుకుంది. కాగా ఈ మూవీ ప్రస్తుతం విడుదలకు సిద్ధమైంది. మొదట ఈ మూవీని జులై 21వ తేదీన విడుదల చేయాలని అనుకున్నారు. కానీ తాజాగా మూవీ విడుదలను వాయిదా వేశారు. కొత్త తేదీని ప్రకటించారు. ఈ మూవీని ఈ నెల 29వ తేదీన న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇక ఈ సినిమాకి డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ శిష్యుడు డాక్టర్ ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఫుల్ కామెడీ మూవీగా ఇది సాగనుంది. ట్రైలర్ చూసిన వారికి ఇప్పటికే మూవీ కథ అర్థమై ఉంటుంది. హీరో హీరోయిన్లు విపరీతంగా ప్రేమించుకుంటారు. వారి పెళ్లికి కష్టపడి పెద్దలను ఒప్పిస్తారు. తీరా వారు పెళ్లికి అంగీకరించే సమయానికి హీరో జాతకంలో దోషం ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో వారు ఆ దోషం పోవడానికి కుక్కతో పెళ్లి చేస్తారు. ఇక్కడే స్టోరీ టర్న్ తిరుగుతుంది. దోషం పోయింది కదా అని మళ్లీ హీరోయిన్ ని పెళ్లి చేసుకునే సమయానికి కుక్క కోర్టుకి ఎక్కుతుంది. కుక్క కోర్టుకి ఎక్కి న్యాయం కోసం పోరాడటంతో కథ ఫన్నీ టర్న్ తీసుకుంటుంది. మరి చివరకు ఏమైంది.తాను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడో లేదో తెలియాలంటే మూవీ విడుదల అయ్యే వరకు ఆగాల్సిందే. కాగా ఈ మూవీలో బ్రహ్మాజీ కీలక పాత్ర పోషిస్తున్నాడు. తన కొడుకు మొదటి సినిమా పిట్ట కథలోనూ బ్రహ్మాజీ పోలీసు అధికారిగా నటించగా ఇందులో లాయర్ పాత్ర పోషించడం విశేషం. మొదటి సినిమాతో పర్వాలేదు అనిపించిన సంజయ్ రావు ఈ సినిమాతో అయినా హీరో గా క్లిక్ అవుతాడో లేదో చూడాలి. ఇక ప్రణవి మానుకొండకి హీరోయిన్ గా ఇది మొదటి సినిమా. గతంలో ఆమె చైల్డ్ ఆర్టిస్ట్ గా చాలా సినిమాల్లో నటించి ఇప్పుడు ఈ సినిమాతో హీరోయిన్ గా మారారు. మరి ఈ మూవీ ఆమె కెరీర్ కి ఎంతలా ఉపయోగపడుతుందో చూడాలి.

## హిట్ 2 పాప.. ఎంత హాటో..

మోడల్ గా వివిధ రకాల ఫ్యాషన్ పోటీలలో మంచి గుర్తింపుని అందుకొని మిస్ ఇండియా పోటీల్లో కూడా స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచిన వారిలో మీనాక్షి చౌదరి ఒకరు. హర్యానా నుంచి మోడలింగ్ ప్రపంచంలో బాగానే పోటీపడిన ఈ బ్యూటీ మొదట బాలీవుడ్ ఇండస్ట్రీలోనే సినిమాలు చేయాలని అనుకుంది. అయితే అక్కడ సరైన అవకాశాలు రాలేదు. దీంతో ఆమె అందరూ ఫాలో అయ్యే టాలీవుడ్ ఫార్మాట్ ను ఫాలో అయింది. ఇక్కడ సక్సెస్ అయితే ఆ తర్వాత ఈజీగా బాలీవుడ్ ఇండస్ట్రీలో అవకాశాలు వస్తాయి అని అనుకుంది. అయితే ఇప్పుడు బాలీవుడ్ కంటే కూడా టాలీవుడ్ లోనే అత్యధిక స్థాయిలో రెమ్యునరేషన్స్ ఇస్తున్నారు. అలాగే మంచి క్రేజ్ దక్కుతోంది కాబట్టి అమ్మడు ఇప్పుడు ఎక్కువగా ఇటువైపే ఫోకస్ చేస్తుంది. ఇక రీసెంట్ గా అడవి శేష్ హీరోగా వచ్చిన హిట్ సినిమాలో హీరోయిన్ గా కనిపించిన మీనాక్షి చాలా సింపుల్ గానే దర్శనం ఇచ్చింది. ఆమెను



మొదటిసారి ఎవరైనా చూస్తే గ్లామరస్ బ్యూటీ అనుకోరు. ఆ విధంగా ఆమె కొన్ని సన్నివేశాలలో చాలా హోమ్లీగా కనిపించింది. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఇప్పుడు మీనాక్షి చౌదరి ఫోటోలు చూస్తే ఎవరైనా సరే షాక్ అవ్వాల్సిందే. రీసెంట్ గా అమ్మడు మరోసారి ఏద అందాలతో స్టన్ అయ్యేలా చేసింది. గతంలో చాలాసార్లు ఘాటైన స్టిల్స్ తో షాక్ ఇచ్చిన అమ్మడు ఈసారి అంతకుమించి అనేలా రోజులతో మైమరపించింది. ఈ బ్యూటీకి ఇండస్ట్రీలో అయితే మంచి హీరోయిన్ గా గుర్తింపు దక్కే అవకాశం అయితే ఉంది. కానీ అదృష్టం కూడా కలిసి రావాలి. సరైన స్క్రిప్టులు సెలెక్ట్ చేసుకోవడం లోనే అసలైన కెరీర్ ఆధారపడి ఉంటుంది. ఇక మీనాక్షి చౌదరి ప్రస్తుతమైతే ఒక తమిళం సినిమాలోని నటిస్తోంది. ఇక తెలుగులో మరిన్ని ఆఫర్ల కోసం ఆమె ఎదురు చూస్తోంది. అలాగే నెట్ ఫ్లిక్స్ స్టార్ట్ చేయబోతున్న ఒక వెబ్ సిరీస్ లో కూడా ఈ బ్యూటీకి అవకాశం వచ్చినట్లు తెలుస్తోంది.

## క్రేజు పెరగడంతో గ్లామర్ డోస్ పెంచిన కృతి

చిన్న వయసులోనే స్టార్ హీరోయిన్ గా మంచి గుర్తింపు అందుకున్న కృతి శెట్టి ఆ తర్వాత రెమ్యునరేషన్ విషయంలో కూడా వెంటనే స్పీడ్ పెంచేసింది. ఆమె చాలా వేగంగానే కోటికి పైగా రెమ్యునరేషన్ అందుకుని ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఉప్పెన తర్వాత మళ్ళీ ఈ బ్యూటీ కెరీర్లో మళ్ళీ ఎలాంటి సక్సెస్ అయితే పడలేదు. శ్యామ్ సింగరాయ్ బంగార్రాజు సినిమాలు పర్వాలేదు అనిపించినప్పటికీ కూడా ఆ తర్వాత చేసిన సినిమాలు అన్నీ కూడా ఒక్కొక్కటిగా దారుణమైన ఫలితాన్ని కలిగించాయి. రామ్ పోతినేనితో చేసిన ది వారియర్ అలాగే నితిన్



తో చేసిన మాచర్ల నియోజకవర్గం రెండు సినిమాలు కూడా వెంట వెంటనే డిజాస్టర్ అయ్యాయి. ఇక టాలెంటెడ్ దర్శకుడు మోహన్ కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో చేసిన 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' అనే సినిమా కూడా ఫ్లాప్ అయింది. ఇక ఈ ఏడాది నాగచైతన్యతో చేసిన కస్టడీ సినిమా కూడా పెద్దగా సక్సెస్ కాలేదు. ఈ బ్యూటీ ప్రస్తుతం ఫ్లాప్ ట్రాక్ లోనే కొనసాగుతోంది. అయినప్పటికీ కూడా ఆమెకు ఇండస్ట్రీలో ఫాలోయింగ్ అయితే గట్టిగానే పెరుగుతుంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో అమ్మడు రీసెంట్ గా ఒక రికార్డును అందుకుంది. ఇటీవల కాలంలో ఇన్ స్టాగ్రామ్ లో ఎ వరికీ కూడా ఈ స్థాయిలో అయితే క్రేజ్ రాలేదు. అమ్మడు వచ్చి చా లా తక్కువ కాలం అయినప్పటికీ కూడా ఏకంగా 6 మిలియన్ల ఫాలో వర్స్ పెరగడం విశేషం. ఇక ఈ సందర్భంగా అమ్మడు ప్రత్యేకమైన కొన్ని గ్లామరస్ ఫోటోలను కూడా పోస్ట్ చేసింది. 6 మిలియన్ ఫ్యామిలీ అంటూ పర్పుల్ కలర్ డ్రెస్ లో అమ్మడు తన అందాలు హైలైట్ అయ్యే విధంగా స్టిల్ ఇచ్చింది. ఇక ఫోటోలు నిమిషాల్లోనే సోషల్ మీడియాలో వైరల్ గా మారిపోయాయి. చూస్తుంటే కృతి శెట్టి మెల్ల మెల్లగా గ్లామర్ డోస్ పెంచుతున్నట్లుగా తెలుస్తోంది.

2003లో జన్మించిన కృతి శెట్టి వయసు ఇప్పుడు 19 ఏళ్ళ మాత్రమే. ఇక అమ్మడు స్టార్ హీరోయిన్ గా మొదట భారీ స్థాయిలో పారితోషకం అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన కమర్షియల్ సినిమాలు కొంత నిరాశపరిచాయి. ఇక ఇప్పుడు ఆమె చేతిలో ఒక మలయాళం సినిమాతో పాటు తమిళంలో జీని అనే ఒక పెద్ద సినిమా అయితే ఉంది. ఈ రెండు సినిమాలు మాత్రమే ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్నాయి. అలాగే తెలుగులో మరొక ఆఫర్ అందుకునే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.



# కలహాలు మాని కలిసి పనిచేద్దాం.. కాంగ్రెస్ నేతల ఐక్యతారాగం

హైదరాబాద్: కలహాలు మాని కలిసి పనిచేద్దాం.. కర్ణాటకలో మాదిరిగా తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొద్దామని కాంగ్రెస్ నేతలు నిర్ణయించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇంట్లో కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, సంపత్‌కుమార్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సమావేశం ముగిసిన తర్వాత ఎంపీ వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ఈ తొమ్మిదేళ్లలో కేసీఆర్ కుటుంబం తప్ప రాష్ట్రంలో ఎవరూ బాగుపడలేదని విమర్శించారు. కేసీఆర్ కుటుంబం ప్రగతి భవన్ ఖాళీచేయక తప్పదని జోస్యం చెప్పారు. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నిరసనలు చేయాలని మంత్రి కేటీఆర్ పిలుపునిస్తే ఎవరూ రాలేదన్నారు. సాగుకు 8గంటలు మించి ఉచిత విద్యుత్ ఇవ్వట్లేదని, తాను సబ్ స్టేషన్లలో లాగ్‌బుక్స్ తీసి నిలదీశాక కొంచెం ఎక్కువ సేపు కరెంటు ఇస్తున్నారని తెలిపారు.

కేటీఆర్‌ను కాకుండా.. బీసీని సీఎంగా చేస్తారా? అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. బీసీలకు కాంగ్రెస్‌ను మించి న్యాయం చేసిన పార్టీ మరొకటి లేదన్నారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి పేదల భూములు లాక్కుంటున్నారని ఆరోపించారు. ధరణిలో పేరు నమోదు కాకపోవడంతో లక్షలాది మంది రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఓట్ల కోసం దళిత బంధు, బీసీ బంధు పెట్టి.. ఎమ్మెల్యేలు కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలకు నియంత పాలన నుంచి విముక్తి కల్పించడమే కాంగ్రెస్ పార్టీ ఏకైక లక్ష్యమని, అందుకోసం అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

# పారిశుద్ధ్య కార్మికులు సమ్మె వీడి.. విధుల్లో చేరండి: మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా గ్రామ పంచాయతీ కార్మికులు వెంటనే సమ్మె వీడి విధుల్లో చేరాలని మంత్రి హరీశ్ రావు అన్నారు. పారిశుద్ధ్య కార్మికుల విషయాన్ని ప్రభుత్వం తప్పకుండా ఆలోచన చేస్తుందని చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ అడగకుండానే రూ.వెయ్యి వేతనాన్ని పెంచారని గుర్తుచేశారు. ఇప్పటికీ సీఎం కేసీఆర్ దృష్టిలో పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్లు ఉన్నాయని, సమయానుకూలంగా నిర్ణయం తీసుకుంటారని భరోసా ఇచ్చారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కార్మికులతో చర్చలు జరిపి తప్పకుండా వీలైనంత వరకు త్వరితగతిన సాయం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని వెల్లడించారు. పారిశుద్ధ్య కార్మికులంతా సమ్మెను విరమించి అందరూ పని చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలోనే పారిశుద్ధ్య కార్మికులకు అధిక వేతనాలు ఇస్తున్నట్లు మంత్రి హరీశ్ చెప్పారు. గత ప్రభుత్వాలలో రూ.500, రూ.1000 కూడా లేని వేతనాలను గ్రామాల్లో కార్మికులు గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో అడగకుండానే సీఎం కేసీఆర్ రూ.8,500కు పెంచారన్నారు. అలాగే అడగకుండానే ఈ మధ్యే రూ.8,500 నుంచి రూ.9,500కు పెంచిన మనసున్న మనిషి కేసీఆర్ అని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత ప్రాంతాలలో కనీసం మనుషులుగా కూడా ఆ ప్రభుత్వాలు చూడట్లేదన్నారు. ఉత్తరప్రదేశ్‌లో రూ.5,200, మన పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కూడా రూ.5,200 ఇస్తున్నారని వెల్లడించారు. ఇక ఛత్తీస్‌గఢ్‌లో పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం అసలు వేతనమే ఇవ్వడంలేదని, గ్రామ పంచాయతీలే తోచినంత ఇస్తున్నాయని చెప్పారు. ఒడిశాలో ఇంటికి రూ.5 మాత్రమే ఇస్తున్నారని, పశ్చిమ బెంగాల్‌లో అయితే 'పెయిడ్ వర్కర్స్' అని పెట్టి నెలకు రూ.500 మాత్రమే ఇస్తున్నారని, కేరళ శానిటేషన్ వర్కర్లు అని పెట్టి ఇంటికి కేవలం రూ.30 ఇస్తున్నారని వెల్లడించారు. అంటే ఒక కార్మికుడు పనిచేస్తే కనీసం రూ.4 నుంచి 5 వేలు కూడా రాని పరిస్థితి ఉన్నదని మంత్రి పేర్కొన్నారు. దేశమంతా ఇలాంటి పరిస్థితులు ఉంటే మన ముఖ్యమంత్రి కేసీఆర్ పల్లెప్రగతి లాంటి గొప్ప కార్యక్రమాన్ని తీసుకుని మన పల్లెలు దేశానికే ఆదర్శంగా నిలిచేటట్లు చేశారని గుర్తుచేశారు. ఈ విజయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, మల్టీపర్పస్ వర్కర్ల పాత్ర మరువలేనిదని తెలిపారు. వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా గౌరవంగా చూస్తుందన్నారు. పనికిమాలిన రాజకీయాలు చేసే కొన్ని పార్టీల ఉచ్చులో పడొద్దని, సీఎం కేసీఆర్ కార్మికులందరినీ చల్లగా చూస్తారని, ఎలాంటి సమ్మెలు, ధర్నాల వంటి కార్యక్రమాల్లో పాల్గొని తెలంగాణ పల్లెలకున్న గొప్ప పేరును ఖరాబు చేయవద్దన్నారు. అలాగే కొంతమంది క్వాలిఫైడ్ కార్మికులు 'అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శి'గా గుర్తింపునివ్వాలని కోరినట్లు, దాన్ని కూడా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తామని మంత్రి హరీశ్ రావు చెప్పారు.




# కూలీలతో కలిసి నాట్లు వేసిన.. ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

మెదక్ : ప్రజా సమస్యలు తెలుసుకోవడంలో మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ఎప్పుడూ ముందే ఉంటారు. అధికారిక కార్యక్రమాలతో బిజీ ఉన్నా సామాన్యులతో కలిసిపోతారు. తాజాగా జిల్లాలోని హవేలీ ఘనపూర్ మండలం చౌట్లపల్లి గ్రామంలో మహిళా కూలీలతో కలసి నాట్లు వేసి కూలీలను ఉత్సాహపరిచారు. మహిళా కూలీలు పాట పాడగా వారితో కలిసి కొద్దిసేపు ఎమ్మెల్యే గొంతు కలిపారు. అనంతరం సాగు సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కరెంట్, ఎరువులు సకాలంలో అందుతున్నాయా అని ఆరా తీశారు. ఎమ్మెల్యే హోదాను పక్కనపెట్టి తమ సమానంగా నాటు వేసిన పద్మాదేవేందర్‌రెడ్డి పనితనానికి కులీలు మురిసిపోయారు.

# భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి నీటి మట్టం



భద్రాచలం: ఎగువన కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. మంగళవారం సాయంత్రం 20 అడుగులు ఉన్న నీటిమట్టం.. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు 28.9 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతంలోని ప్రాజెక్టుల నుంచి నీటిని దిగువకు వదలడంతో రానున్న 24 గంటల్లో ఇంకా వరద పెరిగే సూచనలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం గోదావరి స్నానఘట్టాలు చాలా వరకు మునిగిపోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వేటకు వెళ్లవద్దని జాలర్లకు సూచించారు. భద్రాద్రి రామయ్య దర్శనానికి వచ్చే భక్తులు స్నానం చేసేటప్పుడు లోతుకు వెళ్లవద్దంటూ నది వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తీర ప్రాంతంలో ప్రభుత్వ అధికారులు ఎప్పటికప్పుడు వరద నీటి మట్టం వివరాలను లోతట్టు ప్రాంతవాసులకు అందించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఆదేశించారు. వరద పరిస్థితిని పరిశీలించేందుకు చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో కలెక్టర్ పరిశీలిస్తున్నారు.

# రాష్ట్రంలో ఊపందుకున్న వర్షాలు.. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద

హైదరాబాద్: వర్షాలు ఊపందుకోవడంతో రాష్ట్రంలోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చిచేరుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలతో నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు 4280 క్యూసెక్కుల వరద వస్తున్నది. జలాశయంలో ప్రస్తుతం 689.42 అడుగుల వద్ద నీటిమట్టం ఉండగా పూర్తి స్థాయి నీటి మట్టం 700 అడుగులు. ఇక స్వర్ణ ప్రాజెక్టుకు 890 క్యూసెక్కుల వరద వస్తుండటంతో 1164 అడుగులకు నీటిమట్టం చేరింది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 1189 అడుగులుగా ఉంది. భారీ వర్షాలతో కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఎగువ నుంచి 1500 క్యూసెక్కుల వరద వస్తున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు కాగా, ప్రస్తుతం 1388.32 అడుగుల వద్ద ఉన్నది. నిజామాబాద్ జిల్లా మాధవ్‌నగర్‌లో వరద ప్రవాహానికి బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో నిజామాబాద్-డిచ్‌పల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు వాహనాలను బైపాస్ రోడ్డు మీదుగా మళ్లిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. ఎగువన భారీ వర్షాలతో ప్రస్తుతం 8.25 మీటర్ల ఎత్తులో నది పరుగులుపెడుతున్నది. ఛత్తీస్‌గఢ్‌లో వర్షాల వల్ల ములుగు జిల్లాలోని పాలెం వాగు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నది. దీంతో అధికారులు 4 గేట్లు ఎత్తి 6750 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్నది. దీంతో 21 గేట్లు ఎత్తి 49,244 క్యూసెక్కుల నీటిని అధికారులు గోదావరి నదిలోకి విడుదల చేశారు. కాగా, భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. ప్రస్తుతం 26.7 అడుగుల వద్ద ప్రవహిస్తున్నది. నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర జలవనరుల శాఖ హెచ్చరించింది. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుకి వరద కొనసాగుతున్నది. సింగూరు ప్రాజెక్టుకు ప్రస్తుతం 2847 క్యూసెక్కుల వరద వస్తుండగా, 405 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తున్నది. జలాశయం పూర్తి నీటిసామర్థ్యం 29.917 టీఎంసీలు. ప్రస్తుతం 18.640 టీఎంసీలకు చేరుకున్నది.




దేహ్రాదూన్: ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో విద్యుదాఘాతానికి గురై 15 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో పోలీసులు కూడా ఉన్నారు. ఘటనలో పలువురు గాయపడ్డారు. చమోలీ జిల్లాలోని అలకనందా నదిపై ఉన్న నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నమామీ గంగా ప్రాజెక్టులో భాగంగా అలకనందా నదిపై ఉన్న వంతెనకు విద్యుత్ ప్రవాహం జరగడం వల్ల ఈ ఘోరం జరిగింది.

ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడం వల్ల వంతెన రెయిలింగ్‌కు విద్యుత్ ప్రవహించి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 'ఈ ప్రమాదంలో 15 మంది మృతి చెందారు. వారిలో పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్, హోం గార్డులు ఉన్నారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు జరుగుతోంది. రెయిలింగ్‌కు విద్యుత్ ప్రవాహం జరగడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నాం' అని ఉత్తరాఖండ్ ఏడీజీపీ వి. మురుగేశన్ వెల్లడించారు. పీపల్‌కోటి అవుట్ పోస్టు ఇంఛార్జి కూడా మృతి చెందినవారిలో ఉన్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ఈ ప్రమాదం మంగళవారం రాత్రి జరిగిందని చమోలీ ఎస్పీ ప్రమేంద్ర ఢోబాల్ వెల్లడించారు. 'వంతెన వద్ద ఉన్న భద్రతాసిబ్బంది ఒకరు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు మాకు సమాచారం అందింది'అని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 15 మంది మృతి చెందారని, మిగిలిన వారి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు.

**విచారణకు ఆదేశించిన ముఖ్యమంత్రి** : ఈ ప్రమాదంపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఘటనాస్థలాన్ని పరిశీలించనున్నారు. అలాగే ఈ ఘటనపై జ్యుడిషియల్ విచారణకు ఆదేశించారు.

'ఇది తీవ్ర దురదృష్టకర ఘటన. సహాయక చర్యల నిమిత్తం పోలీసులు, విపత్తు నిర్వహణ సిబ్బంది ఘటనాస్థలిలో ఉన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షిస్తాం' అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ఘటనపై స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. విద్యుత్ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ.. వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.




# గోషామహల్ పరిస్థితులపై రాజాసింగ్‌తో చర్చించా: ఈటల

గోషామహల్ నియోజకవర్గంలో ఇటీవల నెలకొన్న పరిస్థితులపై ఎమ్మెల్యే రాజాసింగ్‌తో చర్చించినట్లు భాజపా ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్ వెల్లడించారు. రాజాసింగ్‌ను ఆయన నివాసానికి వెళ్లి ఈటల ఇవాళ కలిశారు. రాజాసింగ్ సస్పెండ్‌పై అధిష్ఠానం మాట్లాడుతుందని తెలిపారు.

**నా సస్పెన్షన్‌పై ఈటలతో చర్చించలేదు: రాజాసింగ్** – ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ఆయన నివాసానికి వెళ్లి భాజపా ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇటీవల రాజాసింగ్‌ను పార్టీ నుంచి అధిష్ఠానం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, తన సస్పెన్షన్‌పై ఈటలతో చర్చించలేదని భేటీ అనంతరం రాజాసింగ్ వెల్లడించారు.

# జయశంకర్ భూపాలపల్లిలో భారీ వర్షాలు..

## సింగరేణి ఓపెన్ కాస్ట్‌లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి



భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వానలతో సింగరేణి ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఓపెన్ కాస్ట్ కేటీకే 2, 3 గనుల్లో 7,025 టన్నుల బొగ్గుఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. దీంతో సింగరేణి కాలరీస్‌కు రూ.1.72 కోట్లు నష్టం వాటిల్లింది. భారీ వర్షాల నేపథ్యంలో 1.63 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు ఆగిపోయాయి. రాష్ట్రంలో రాగల ఐదురోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మంగళవారం నుంచి బుధవారం వరకు ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నది. ఈ మేరకు ఉత్తర తెలంగాణ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, భద్రాద్రి–కొత్తగూడెం, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి, యాదాద్రి–భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

**అప్రమత్తంగా ఉండాలి: సీఎస్** – వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. కలెక్టర్లు, అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ నుంచి అతిభారీ వర్షాలతో ముప్పు పొంచి ఉందని, ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదురొనేందుకు సిద్ధంగా ఉండేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆమె ఆదేశించారు.

కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, దుర్బలమైన కాజ్‌వేలు, వంతెనలను ఇప్పటికే గుర్తించినట్టు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి రాహుల్ బొజ్జా తెలిపారు. అగ్నిమాపక శాఖ ఇప్పటికే అన్ని జిల్లాల కార్యాలయాల్లో అవసరమైన పరికరాలను ఏర్పాటు చేసినట్టు అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి తెలిపారు.



# రాష్ట్రంలో భారీ వర్షాలు.. ఆర్టీసీ డ్రైవర్లు అలసత్వం వహించొద్దని ఆదేశాలు

హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. మరో వారం రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో టీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ఆర్టీసీ డ్రైవర్లందరూ తమ విధుల పట్ల ఏ మాత్రం అలసత్వం వహించొద్దని ఆదేశించారు. ప్రమాదాలను నివారించాలని సూచించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని బాజిరెడ్డి గోవర్ధన్ సూచించారు.

# ఆగస్ట్ నుంచి ప్రజల్లోకి...

హైదరాబాద్: ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసంలో ఈరోజు (బుధవారం) కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం జరిగింది. దీనిపై ఎంపీ మాట్లాడుతూ... ఆగస్ట్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని తెలిపారు. నేతలమంతా చిన్న చిన్న విభేదాలు పక్కన పెట్టి ఐక్యంగా పనిచేస్తామన్నారు. వచ్చే ఐదు మాసాలు కష్టపడి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తామని ఎంపీ ధీమా వ్యక్తం చేశారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నేతల లంచ్ మీట్ నేపథ్యంలో నేతలంతా ఒక్కొక్కరుగా ఎంపీ నివాసానికి చేరుకుంటున్నారు. ఇప్పటికే జానారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య కోమటిరెడ్డి నివాసానికి చేరుకోగా.. కాసేపటి క్రితమే టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, సంపత్ కుమార్.. కోమటిరెడ్డి ఇంటికి వచ్చారు. వీరికి శాలువా కప్పి వెంకట్‌రెడ్డి స్వాగతం పలికారు. కాంగ్రెస్ కీలక నేతల సమావేశంలో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ 2.0పై ప్రధానంగా చర్చించనున్నారు. పార్టీలోకి భారీగా చేరికలు ఉండేలా టీపీసీసీ ప్లాన్ చేస్తోంది. నేటి సమావేశంలో చేరికలపైనే నేతలు ప్రధానంగా చర్చించనున్నారు. రేపు ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో పలువురు నాయకులు పార్టీలో చేరనున్నారు. గద్వాల జడ్పీ చైర్ పర్సన్ సరితా తిరుపతయ్య, ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత సునీల్ రెడ్డి తదితరులు రేపు ఢిల్లీలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. బీఆర్ఎస్ అసంతృప్త నేతలతో కాంగ్రెస్ సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్పర్సన్ సునీత మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్పర్సన్ తీగల అనిత రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ తదితర నేతలతో చర్చలు జరుగుతుండగా.. త్వరలో వీరంతా కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com